
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

బుధవారం 23 ఏప్రిల్ 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.150	230	260
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 । కనిష్ఠం 25.2



నల్లగొండలో ఫలితాలను చూస్తున్న విద్యార్థులు

ఇంటర్‌లో బాలికలదే పైచేయి

ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ

ఉమ్మడి జిల్లాలో ఇంటర్మీడియట్‌లో మరోసారి బాలికలే పైచేయి సాధించారు. మంగళవారం ఇంటర్ ప్రథమ,ద్వితీయ సంవత్సరం ఫలితాలు విడుదల కాగా, ప్రథమ సంవత్సరంలో జనరల్‌విభాగంలో నల్లగొండ జిల్లాలో బాలికలు 65.40శాతం, సూర్యాపేటజిల్లాలో బాలికలు 65.05 శాతం, యాదాద్రి జిల్లాలో బాలికలు 67.31శాతంతో ప్రతిభ చాటారు. ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో నల్లగొండ జిల్లాలో బాలికలు 60.97శాతం, సూర్యాపేట జిల్లాలో 75.05 శాతం, యాదాద్రి జిల్లాలో 76.41శాతంతో ఉత్తీర్ణత సాధించారు.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ, యాదాద్రి, భానుపురి)

నల్లగొండ జిల్లాలో...

నల్లగొండ జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో మొత్తం 11,694మంది పరీక్షలు రాయగా 6,781మంది (57.99శాతం) ఉత్తీర్ణులయ్యారు. అందులో బాలురు 5,452మంది పరీక్షలు రాయగా,2,699మంది (49.50శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికల విభాగంలో 6,262మంది పరీక్షలు రాయగా, 4,082మంది (65.40శాతం) ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో బాలికలే పైచేయి సాధించారు. ఒకేషనల్ విభాగంలో 2,283మంది పరీక్షలు రాయగా 1,150 మంది (50.37శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలుర విభాగంలో 1,259మంది పరీక్షలు రాయగా 461మంది (36.62శాతం), బాలికల విభాగంలో 1,024మంది పరీక్షలు రాయగా 689మంది (67.29శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత శాతం ఏమాత్రం మెరుగుపడలేదు. ఫస్టియర్‌లో రాష్ట్రంలో 16 స్థానం, సెకండియర్‌లో 19వ స్థానంలో నిలిచింది. అధ్యాపకులు, విద్యార్థులు సరైన దృష్టిసారించకపోవడంతో ఫలితాలు పడిపోయాయని పలువురు పేర్కొంటున్నారు. ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో 10,957 మంది పరీక్షలు రాయగా, 7,543మంది (68.84శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలుర విభాగంలో 5,006మంది పరీక్షలు రాయగా, 3052మంది (60.97శాతం), బాలికల విభాగంలో 5,951మంది పరీక్షలు రాయగా 4,491 మంది (75.47శాతం) ఉత్తీర్ణులయ్యారు. సెంకడియర్ జనరల్ విభాగంలో కూడా బాలికలే పైచేయి సాధించారు. ఒకేషనల్ విభాగంలో 2,035మంది పరీక్షలు రాయగా 1,417మంది(69.63శాతం) ఉత్తీర్ణులయ్యారు. అందులో బాలురు1,137మంది పరీక్షలు రాయగా 650 మంది(57.17శాతం), బాలికలు 898మంది పరీక్షలు రాయగా 767మంది (85.41శాతం) ఉత్తీర్ణులయ్యారు.

నాలుగేళ్లుగా నల్లగొండ జిల్లాలో ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత ఇలా..

సంవత్సరం	ఫస్టియర్			సెకండియర్		
	హాజరు	ఉత్తీర్ణత	శాతం	హాజరు	ఉత్తీర్ణత	శాతం
2020-21	16,240	9,805	61.00	16,061	10,964	68.00
2022-23	12,408	12,174	98.11	13,222	10,485	79.29
2023-24	11,555	6,610	57.02	11,474	7,854	68.45
2024-25	11,694	6,781	57.99	10,957	7,543	68.84

యాదాద్రి జిల్లాలో...

యాదాద్రి జిల్లాలో ప్రథమ సంవత్సరంలో 58.54 శాతం, ద్వితీయ సంవత్సరంలో 67.92శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో 6,208 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 3,634 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో 5,330 మంది పరీక్ష రాయగా, 3,756మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో బాలురు 48.88శాతం, బాలికలు 67.92శాతం, ద్వితీయ సంవత్సరంలో బాలురు 52.43శాతం, బాలికలు 72.33శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగంలో మొత్తం 62.96శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ప్రథమ సంవత్సరంలో 58.54శాతం, ద్వితీయంలో 67.92శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో 6,208 మంది విద్యార్థులకు 3,634మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 5,530మంది పరీక్ష రాయగా, 3,756మంది ఉత్తీర్ణత సాధించారు.

సూర్యాపేట జిల్లాలో...

సూర్యాపేట జిల్లాలో మొత్తం 75 కళాశాలలు ఉండగా, 15,586 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. గత ఏడాదికంటే ఈ విద్యాసంవత్సరంలో 8.8 శాతం ఉత్తీర్ణత పెరిగింది. ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 6,389 మంది పరీక్ష రాయగా, 3,613 మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో బాలురు 2,878 మంది పరీక్ష రాయగా, 1,329 మంది (48.18శాతం), బాలికలు 3,511మంది పరీక్ష రాయగా, 2,284 మంది (65.05 శాతం) ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది 49శాతం...

- మిగతా 7వ పేజీలో...



అవకాశాలకు నెలవు.. వేసవి సెలవులు

- రేపటి నుంచి వేసవి సెలవులు
- మరో వారంలో పదో తరగతి పరీక్షా ఫలితాలు

ఇంతకాలం పుస్తకాలతో కుస్తీపట్టిన పిల్లలు సెలవుల మూడ్‌లోకి వచ్చేశారు. ఈ నెల 17వ తేదీతో 1 నుంచి 9వ తరగతి వరకు పరీక్షలు పూర్తయ్యాయి. ఈ నెల 23న ప్రోగ్రెస్ కార్డుల జారీతో 2024-25 విద్యాసంవత్సరం ముగియనుంది. 24వ తేదీ నుంచి పాఠశాలలకు సెలవులు. దీంతో చిన్నారులు వేసవి సెలవుల్లో ఉల్లాసంగా గడిపేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఇంటర్ పరీక్షలు పూర్తయి మంగళవారం ఫలితాలు వచ్చాయి. మరో వారంలో పదో తరగతి పరీక్ష ఫలితాలు కూడా రానున్నాయి. దీంతో భవిష్యత్ అవకాశాలకు, నాణ్యమైన విద్య అందించే ప్రణాళికల్లో తల్లిదండ్రులు నిమగ్నమవుతున్నారు. ఇతర కోర్సుల్లోని విద్యార్థులు సైతం సెలవులను ఆస్వాదిస్తూనే కొత్త కోర్సులపై దృష్టి సారిస్తున్నారు. అయితే విద్యాసంవత్సరం ముగియడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన, ఆరాటం పెరుగుతుంది. ఏ కోర్సుల్లో, ఏ కళాశాలలో చేర్పించాలని, బడ్జెట్ ఎంతవరకు సహకరిస్తుందనే లెక్కలు వేసుకుంటుంటారు. అయితే పిల్లల ఆసక్తి ఏంటో తెలుసుకోకుండా వ్యవహరిస్తే ప్రమాదమని, వారి అభిప్రాయాలకూ విలువ ఇవ్వాలని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

•6లో..

- (ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్, కోదాడ)

ఈ విద్యాసంవత్సరంలో అంతంతగానే బోధన!

- విద్యార్థులను వెంటాడిన సాంకేతిక సమస్యలు
- వన్ నేషన్, వన్ ఎడ్యుకేషన్ పాలసీకి కేంద్రం అడుగులు
- కొత్త విధానంతో ఇంటర్ స్థానంలో స్కూల్ ఎడ్యుకేషన్
- 5, 8వ తరగతిలో నోడిటెన్షన్ పాలసీ పునరుద్ధరణ

•6లో



బైపీసీలో 'గౌతమి' విద్యార్థికి 994 మార్కులు

- ఎంపీసీ విభాగంలో 993

•6లో..

ఎంపీసీలో 'ప్రగతి' విద్యార్థికి 995 మార్కులు

- బైపీసీ విభాగంలో 994

•6లో..





ఎంపీసీలో 'కేఎల్ఎన్' విద్యార్థికి 992 మార్కులు

- బైపీసీ విభాగంలో 985

•7లో..

రైతులకు సకాలంలో డబ్బు చెల్లించాలి

డీఆర్డీవో శేఖర్‌రెడ్డి

గుర్రంపోడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రైతులకు ధాన్యం డబ్బు సకాలంలో అందేలా చూడాలని డీఆర్డీవో శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కాచారం, చామలోనిబావి, కోయగూరోనిబావి, వట్టికోడు ఐకేపీ ఆధ్వర్యంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలకుండా చూడాలని, హమాలీల కేటాయించిన రూ.45 మాత్రమే చెల్లించాలన్నారు. ఏఈవోలు ప్రతీ రోజు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి తేమ శాతాన్ని పరిశీలించాలని సూచించారు. ఆయన వెంట ఏపీఎం ఊరుపక్క యాదయ్య, సీసీలు శేఖరయ్య, రాజేశ్వరి, తదితరులు ఉన్నారు.





భూభారతి చట్టం... ప్రజలకు చుట్టం



యాదాద్రి జిల్లా వలిగొండలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


యాదాద్రి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం.. ప్రజలకు చుట్టం అని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీవాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం వలిగొండలో భూభారతి(ఆర్‌వోఆర్) చట్టంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించేందుకు అధికారులే ప్రజల వద్దకు వస్తారని.. భూములున్న ఆసాములు, రైతులు తమ భూమి భద్రంగా ఉందని గుండెపై చేయి వేసుకుని నిద్దురపోవాలన్న లక్ష్యంతో భూభారతి రూపొందించామన్నారు. రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో భూభారతి పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్నామని, ఒక్క రూపాయి ఫీజు లేకుండా భూ సమస్యలను పరిష్కరిస్తామని.., అధికారులనే క్షేత్రస్థాయికి పంపిస్తున్నామన్నారు. నెలాఖరులోగా నాలుగు మండలాల్లో అన్ని వివరాలు సేకరించి, జూన్ 2న పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నా రు. మే1వ తేదీ నుంచి మరో 28 జిల్లాల్లో ఒక్కో మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకుని భూభారతిని అమలు చేస్తామన్నారు. పైలెట్ మండలాల్లో క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యల పరిష్కారంకోసం ఏమైనా సూచనలు వస్తే నియమనిబంధనల్లో మార్పులు, చేర్పులు చేస్తామన్నారు. గత ప్రభుత్వం అనాలోచనతో 2020 ధరణి చట్టాన్ని తీసుకొచ్చి... ప్రజలకు అనేక ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ధరణి చట్టాన్ని తీసుకొచ్చిన మూడేళ్ల వరకు నియమ నిబంధనలు రూపొందించలేదని... విధివిధానాలు స్పష్టంగా తెలియజేయలేదని.. కేసీఆర్ నోట ఏది వస్తే ఆ మాట ప్రకారమే నడుచుకుందన్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందుల నుంచి విముక్తి చేసేందుకు ఇందిరమ్మ రాజ్యంలో 2025లో భూభారతి చట్టాన్ని తెచ్చామన్నారు. ఏ చట్టమైన ప్రజలకు చుట్టంలాగా, భద్రత కల్పించేలా ఉండాలే తప్ప ప్రజలకు శాపంగా మారకూడదన్నారు. ధరణి పేరుతో భూములు లాక్కున్న వారిపై చర్య లు ఉంటాయని, రాష్ట్రంలో అన్ని రెవెన్యూ గ్రామాలకు అధికారులను నియమిస్తామని మంత్రి తెలిపారు. మే10వ తేదీలోగా సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలే మండలాలకు వస్తారని తెలిపారు. గ్రామాల్లో భూదాన్, వక్ఫ్, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం ఈ చట్టంలో ఉందన్నారు.


సివిల్స్‌లో మౌనిమకు 920వ ర్యాంక్



హాలియా, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): యూ పీఎస్సీ మంగళవారం ప్రకటించిన సివిల్స్- 2024 ఫలితాల్లో అనుముల మండలం వీర్లగడ్డతండా గ్రామానికి చెందిన దేపావత్ మౌని మ ఉత్తమ ప్రతిభ కనబరిచి 920వ ర్యాంక్ సాధించింది. వీర్లగడ్డతండా గ్రామానికి చెందిన దేపావత్ లచ్చిరాం కుమార్తె మౌనిమ ఇంటర్ హైదరాబాద్‌లో, బీటెక్ చెన్నై ఐఐటీ లో చదివి 2023లో స్టాఫ్ సెలక్షన్ కమిటీ పరీక్షల్లో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించింది. ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే ఆలిండియా సివిల్ సర్వీసెస్ పరీక్షకు సన్నద్ధమపై 920వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా ఆమెను కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.








● రేపటి నుంచి వేసవి సెలవులు
● విడుదలైన ఇంటర్ ఫలితాలు
● మరో వారంలో పదవ తరగతి పరీక్షా ఫలితాలు
● ప్రణాళికలో తల్లిదండ్రులు
● సెలవుల సందడిలో విద్యార్థులు
● పిల్లలపై అభిప్రాయాలు రుద్దకుండా సద్వినియోగం చేయాలి: మేధావులు

లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌ను పదిలం చేస్తూ 2024-25 విద్యాసంవత్సరం ముగిసింది. పుస్తకాలు, తరగతి గదులతో కుస్తీ పట్టిన చిన్నారులు వేసవి సెలవుల్లోనైనా ఉల్లాసంగా గడిపేందుకు సిద్ధమవుతున్నారు. మంచి ఫలితాలు సాధించిన వారు అభినందనల్లో మునిగిపోతుండగా వెనకబడిన విద్యార్థులు నిరాశలో ఉన్నారు. అదేసమయంలో నూతన విద్యా సంవత్సరం 2025-26పై రెట్టింపు ఆశలు పెంచుకుంటూ తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్ అవకాశాలకు, నాణ్యమైన విద్య అందించే ప్రణాళికలలో నిమగ్నమవుతున్నారు. ఏదేమైనా పాత, నూతన విద్యా సంవత్సరాల సంధికాలం వలే వేసవి నిలిచింది. ఇదిలాఉండగా ఇతర కోర్సుల్లోని విద్యార్థులు సైతం సెలవులను ఆస్వాదిస్తూనే కొత్త కోర్సులపై దృష్టి సారిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-భువనగిరిటౌన్)



అవకాశాలకు నెలవు
వేసవి సెలవులు



రాష్ట్రంలో పాఠశాలకు వేసవి సెలవులు ఈ నెల 24 నుంచి ప్రారంభమవుతున్నాయి. ఇంటర్ కళాశాలలకు మార్చి 21 నుంచే వేసవి సెలవులు రాగా మిగతా విద్యాసంస్థల సెలవులు కూడా కొద్దిపాటి తేడాతో ఉండనున్నాయి. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 3 వేల ప్రభుత్వ ప్రభుత్వ యాజమాన్య గురుకుల, ప్రైవేట్, సీబీఎస్ఈ పాఠశాలల విద్యార్థులు సుమారు 3.50 లక్షల మంది సుమారు 50 రోజులు ఇంటి వద్ద గడపనున్నారు. అలాగే మిగతా కోర్సులకు చెందిన సుమారు లక్ష మందికిపైగా విద్యార్థులు వేసవి సెలవులతో సందడి చేయనున్నారు.

వెలువడిన ఇంటర్ ఫలితాలు..

ఇంటర్ ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జనరల్ ఇంటర్, ఒకేషనల్ కోర్సుల ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 54,293 మంది పరీక్షలు రాయగా 33,684 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫస్టియర్ 28,253 మందికి 15,985, సెకండియర్ 26,040 మందికి 17,699 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.

● ఈ నెలాఖరున వెల్లడి కానున్న పదవ తరగతి పరీక్షా ఫలితాల కోసం 39,263 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. అయితే ఫీజురీయింబర్స్‌మెంట్ వివాదంలో పరీక్షలు జరగపోవడంతో సుమారు 25వేల మంది విద్యార్థులు డిగ్రీ పరీక్షలకు దూరమై ఆందోళనలకు గురవుతున్నారు. మిగతా విద్యాకోర్సుల పరీక్షా ఫలితాలు కూడా వెల్లడి కానున్నాయి.

పెరుగుతున్న పోటీ కారణంగా విద్యార్థులు ఏడాదంతా పాఠ్యపుస్తకాలకే పరిమితం అవుతున్నారు. అందుకు తల్లిదండ్రుల ఒత్తిడి కూడా ఉంటుంది. దీంతో విద్యార్థుల్లోని ఇతర ఆసక్తులు, సృజనాత్మకత, ప్రతిభ వారిలోనే అంతర్లీనమవుతున్నాయి. ఫలితంగా జీవితకాలమంతా వారిని ఓ వెలితి వెంటాడనుండగా ప్రతిభావంతుల లోటు సమాజానికి కూడా ఏర్పడనుంది. ఈ

సృజనాత్మకతను వెలికి తీసేలా

నేపథ్యంలో వేసవిలో బంధుమిత్రులతో గడుపుతూనే మిగతా సమయంలో ఆసక్తి ఉన్న రంగాలపై శ్రద్ధ చూపేలా తల్లిదండ్రులు అవకాశం కల్పించాలి. సంప్రదాయ నృత్యాలు, పాటలు, తబలా తదితర సాంస్కృతిక కోర్సులు, కంప్యూటర్ కోర్సుల శిక్షణ, క్రీడా శిబిరాల్లో చేర్పించాలి. అలాగే ఈత, సైక్లింగ్, కళాశాలల విద్యార్థులైతే కార్ డ్రైవింగ్, ఉన్నత విద్యార్హ పరీక్షల కోచింగ్‌కు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాల వారీగా మే 1 నుంచి 30 వరకు పలు క్రీడాంశాలతో ప్రభుత్వ యువజన, క్రీడల శాఖ సమ్మర్ క్యాంపులను నిర్వహించి సర్టిఫికెట్లను అందజేయనుంది.

ఆరాటం వద్దు.. ఆలోచనే ముద్దు

విద్యాసంవత్సరం ముగియడంతో తల్లిదండ్రులలో ఆందోళన, ఆరాటం పెరుగుతోంది. పదవ తరగతి పూర్తిచేసిన పిల్లలను ఇంటర్‌లో ఏ కోర్సుల్లో, ఏ కళాశాలలో చేర్పించాలని, అందుకు తమ బడ్జెట్ ఎంతవరకు సహకరిస్తుందని లెక్కలతో సతమతమవుతుంటారు. అంతేకాక చుట్టుపక్కల పిల్లలు ఫలానా కళాశాలలో చేరి ఉన్నత స్థానం పొందారనే సమీకరణలతో తమ పిల్లలు అంతకుమించి ఉన్నత స్థానం పొందాలనే ఆలోచనలు చేస్తుంటారు. దీంతో పిల్లల చదువుకోసం ఆర్థిక స్థాయిని మించి తమ ఇష్టాలను పిల్లలపై బలవంతంగా రుద్దుతుంటారు. కానీ పిల్లల ఆసక్తి ఏంటో తెలుసుకోకుండా వ్యవహరిస్తే దుష్ఫలితాలు వచ్చే ప్రమాదాలు ఉంటుందని, పదవ తరగతి తర్వాత విద్యలో ఖచ్చితంగా పిల్లల అభిప్రాయాలకు విలువ ఇవ్వాలని పలువురు విద్యావేత్తలు సూచిస్తున్నారు. అలాగే ప్రాథమిక తరగతులలో పిల్లలను చేర్పించే తల్లిదండ్రులు పాఠశాల బ్రాండ్ ఇమేజ్ కాకుండా అందులో బోధన నాణ్యత, ఉపాధ్యాయుల అర్హత ఆధారంగా చేర్పిస్తేనే బాగుంటుందని విద్యావేత్తలు అంటున్నారు.

● ఇష్టంతో చదివి డాక్టర్ అయ్యా



డాక్టర్ కావడం చిన్నప్పటి లక్ష్యం. అదేలక్ష్యంతో పాఠశాల విద్యనుంచే చదివా. నా ఇష్టాన్ని తల్లిదండ్రులకు చెప్పా. దీంతో నన్ను ఇంటర్‌లో బైపీసీలో చేర్పించారు. ఇష్టంతో చదివి ఈ ఏడాదే ఎంబీబీఎస్ పూర్తిచేశా. విద్యార్థులు తమ అభిరుచులను ఖచ్చితంగా తల్లిదండ్రులకు చెప్పాలి. ఆ దిశగా తల్లిదండ్రుల ప్రోత్సహించాలి. లక్ష్యాన్ని సాధించేందుకు విద్యార్థులు చిత్తశుద్ధితో కష్టపడాలి.

డాక్టర్ పీఎస్ నీరజ్‌పవన్, భువనగిరి.

వేసవిలో స్వేచ్ఛను ఇవ్వండి ఇలా..

అన్నిస్థాయిల విద్యార్థులకు స్వేచ్ఛ లభించేది వేసవిలో మాత్రమే. ఓ సర్వే ప్రకారం వేసవి సెలవుల వినియోగం, సెలవులలో గడిపిన ప్రభావం మరుసటి విద్యాసంవత్సరం అంతా ఉంటుంది. అందుకే వారికి స్వేచ్ఛగా గడిపే సమయాన్ని తల్లిదండ్రులు ఇవ్వాలి. ఇప్పటికే ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగవుతున్న పరిస్థితి. కనీసం సెలవుల్లోనైనా పిల్లలను తప్పనిసరిగా కుటుంబసభ్యులు, బంధువులతో గడపనివ్వాలి. వారి ఇళ్లకు వెళ్లనివ్వాలి. వేసవిలో వచ్చే ప్రతీ వివాహ, ఇతర శుభకార్యాలకు వెంట తీసుకువెళ్లాలి. దీంతో మానవ సంబంధాలు, కుటుంబ వ్యవస్థ, నైతిక విలువలపై పిల్లలకు అవగాహన పెరుగుతుంది. తమ కుటుంబం ఒంటరికాదు మాకు అందరూ ఉన్నారనే భరోసా కలుగుతుందని మానసిక నిపుణులు పేర్కొంటున్నారు. వీలైతే విహారయాత్రలకు లేదా సమీపంలోని పార్క్‌లకు, ప్రసిద్ధి చెందిన ఆలయాలకు, ప్రదేశాలకు కుటుంబ సమేతంగా వెళ్లడం ద్వారా పిల్లల్లో ఉత్సాహాన్ని నింపినట్టుగా ఉంటుందని తల్లిదండ్రులు గమనించాలంటున్నారు.

పదో తరగతి తరువాత

పదో తరగతి పాస్ అయ్యాక ఏ కోర్సులు చదవాలని విద్యార్థులలో మీమాంస ఉండటం సహజం. ఇందుకు తల్లిదండ్రుల ఇష్టాలు వారిపై రుద్దడం కూడా ఓ కారణం. కానీ పిల్లల విద్యాసామర్థ్యం ఆధారంగానే కోర్సులను ఎంపిక చేసుకునే అవకాశమివ్వాలి. ఆ దశగా ప్రోత్సహించాలి. ఇంటర్ నుంచి పీజీ వరకు ఆర్ట్స్ చదివిన వారికి కూడా పుష్కల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయి. అలాగే 10 తర్వాత పాలిటెక్నిక్, ఐటీఐలలో చేరి ఆ కోర్సుల ఆధారంగా బీటెక్, ఎంటెక్ కూడా చదవొచ్చు. ప్రభుత్వం గ్రూప్స్ ఉద్యోగాల నోటిఫికేషన్స్‌కు ఆర్ట్స్ విద్యార్థులు కూడా అర్హులే. మార్కెటింగ్, ప్రైవేట్ రంగాల్లో ఎంబీఏ, ఎంసీఏ, మేనేజ్‌మెంట్ కోర్సుల ద్వారా పుష్కల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయి.

● లక్ష్యం కోసం మైదానంలో శ్రమిస్తున్నా



పదో తరగతి పరీక్షాఫలితాల కోసం ఎదురుచూస్తున్నా. అయితే అథ్లెటిక్స్‌పై మక్కువతో ప్రతిరోజూ సాధన చేశాను. నాలుగు రాష్ట్రస్థాయి పోటీల్లో మెడల్స్ సాధించా. జాతీయ పోటీల్లోనూ పాల్గొన్నా. అంతర్జాతీయ పోటీల్లో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం నా లక్ష్యం. ఇందుకోసం ప్రస్తుత వేసవి సెలవుల్లో హైదరాబాద్‌లో అథ్లెటిక్స్ కోచింగ్ క్యాంపులో చేరా. ఇంటర్ చదువుతూనే అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటా.

ఎం గణేష్, ప్రజాపతి, భువనగిరి.

● సెలవులను సద్వినియోగం చేయాలి



ఏడాది పొడవునా పాఠాలు చదివిన విద్యార్థులకు లభించే వేసవి సెలవులను తల్లిదండ్రులు సద్వినియోగం చేయాలి. పిల్లల శారీరక దృఢత్వం, మానసిక వికాసం, సామాజిక స్పృహ, కుటుంబ, నైతిక విలువలు తెలిసేలా వేసవి సెలవుల ప్రణాళిక అమలుచేయాలి. అంతేకాని సెలవుల్లో కూడా చదువు పేరిట బలవంత పెట్టొద్దు. వారిలో సృజనాత్మక పెరిగేలా మానసికోల్లాస ఆటలకూ ప్రాధాన్యమివ్వాలి.

కే సత్యనారాయణ, డీఈవో,యాదాద్రిభువనగిరి.

కంప్యూటర్ కోర్స్ నేర్చుకుంటున్నా



ఈ విద్యాసంవత్సరంలో ఇంటర్ పూర్తయ్యింది. వేసవి సెలవుల్లో కంప్యూటర్ కోర్సులు నేర్చుకుంటున్నా. ఏడవ తరగతి నుంచి ప్రతీ వేసవిలో ఓ స్పెషల్ కోచింగ్ తీసుకుంటా. సెలవులు నాకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. మిగతా సమయంలో ఇంటి పనులు నేర్చుకుంటున్నా. డిగ్రీ విద్యపై స్పష్టతతో ఉన్నా.

జీ సామ్య,ఇంటర్ విద్యార్థిని, భువనగిరి.

పిల్లల భవిష్యత్తు కోసం శ్రమిస్తున్నా



మాకు ఇద్దరు కుమారులు. పెద్దబ్బాయి పదో తరగతి పరీక్షలు రాయగా చిన్న అబ్బాయి ఐదో తరగతి. మాది సామాన్య కుటుంబం. పిల్లల చదువుల విషయంలో ప్రణాళికతో వ్యవహరిస్తాం. వచ్చే ఏడాది కూడా ఇదేవిధంగా ముందు జాగ్రత్తతో ఉంటాం. పిల్లల ఉజ్వల భవిష్యత్ లక్ష్యంగా వాళ్ల అభిప్రాయాల మేరకు ప్రోత్సహిస్తాం.

బీ మహేశ్వరి, అనంతరం

ఫెయిల్ అయినా నిరాశపడొద్దు



ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయినా విద్యార్థులు నిరాశపడొద్దు. స్వల్ప కారణాలతో ఫెయిల్ అయిన విద్యార్థులే అధికంగా ఉంటారు. త్వరలో జరుగనున్న అడ్వాన్స్ సప్లి కోసం ఇప్పటినుంచే సిద్ధమవ్వాలి. అనుమానాలు ఉంటే రీకౌంటింగ్‌కు వెళ్లవచ్చు. ఫెయిల్ అయిన పిల్లలకు తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు మానసిక ధైర్యం చెప్పాలి. అయినప్పటికీ కుంగుబాటుకు గురయ్యే విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇప్పించాలి.

సీ రమణి, ఇంటర్ నోడల్ అధికారి, యాదాద్రి భువనగిరి.

ఇంటర్ ఫలితాల్లో 'గౌతమి' ప్రభంజనం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో గౌతమి కళాశాల డైరెక్టర్ పుట్ట వెంకటరమణారెడ్డి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):ఇంటర్ ఫలితాల్లో నల్లగొండ పట్టణంలోని గౌతమి విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో వై.తీక్షరెడ్డి, హిబామైరుక్ 994, మలీహా తస్నీమ్, సోబియా ఖానమ్, బి.కార్తీక్ 991, మదీహా ఫిర్దోజ్, ఎస్.భవ్యశ్రీ, సీహెచ్.సుసన్న 990మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఆర్.సింధు, జె.వైష్ణవి, జి.తేజస్విని 993, సీహెచ్.యమున, ఎ.ఉమా, ఎస్.నవ్య, బి.శిల్ప, పి.నాగరాజు 992మార్కులు, బి.అఖిల, అలీష మెహరీన్, జి.మమత, ఎం.శ్రీను, సీహెచ్.చరణ్ తేజ 991, జి.కావ్యశ్రీ, ఎస్.రమ్య, డి.పరుశరాం, ఎస్.శివ, ఎం.పాండునాయక్ 990మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470మార్కులకు గాను పి.శ్రీచరణ్ 468, ఎస్.నిస్సిసంయుక్త, పి.గణేష్ 467, జెమీరాడురేన్, డి.స్పందన, ఎం.నందిని, ఎస్.అఖిల, హూరియా ఇరమ్, కె.సౌమ్య, ఎం.అర్జున్ 466, ఎ.రిషిత, కె.లహరి, ఎ.అఖిల, డి.అను, జి.సింధూజలు 465మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో కె.దీక్షిత 437, అమతుస్ సలామ్‌ఐమన్ 436, ఎస్.నిఖిత, ఎమ్.అనుజ్ఞ, జబియా ఇర్మాన్, ఎన్.సతీష్‌కుమార్ 434 మార్కులు సాధించారు. వీరిని కళాశాల డైరెక్టర్లు కాసర్ల వెంకట్‌రెడ్డి, చల్లా వెంకటరమణ, కొమ్మిడి రఘుపాల్‌రెడ్డి, పుట్ట వెంకటరమణారెడ్డి అభినందించారు.

సత్తా చాటిన 'ప్రగతి' విద్యార్థులు



ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రగతి కళాశాల చైర్మన్ చందా కృష్ణమూర్తి, డైరెక్టర్లు ఎ.నరేందర్‌బాబు, ఎస్.శశిధర్ రావు, చందా శ్రీనివాస్, పైళ్ల రమేష్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి):ఇంటర్ ఫలితాల్లో నల్లగొండ పట్టణానికి చెందిన ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో పి.మీనాక్షి 995, నజ్‌రాతజ్‌మీన్, జె.మధులత ఎం.మనీష్, అజయ్‌కుమార్ 993 మార్కులు, పి.సింధు, వై.గీత, పి.హాసిని, ఏ.ప్రసన్న, బి.భవాని, సీహెచ్.సిరి, కె.జాహ్నవి, వి.కళ్యాణి 992 మార్కులు సాధించారు. మరో 10మంది విద్యార్థులు 991 మార్కులు, 14మంది 990 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో కె.ఉజ్వల 994, బి.భువనేశ్వరీ, ఇ.అక్షయ 991 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో జి.అనూష 468మార్కులు, కె.సాత్విక్, ఎండీ.అతిఫ్, కె.అక్షర, కె.అక్షిత, జి.వెన్నెల, జి.తేజస్విని, జి.స్నేహారెడ్డి, పి.భువశ్రీ, పి.హంసికాస్నిగ్ధ, ఎన్.రేణుక 467మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చారు. బైపీసీ విభాగంలో ఎం.ఉషశ్రీ, ఏ.సాయి అక్షర, ఎండీ.ఐషాబుటుల్ 435మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ చందా కృష్ణమూర్తి, డైరెక్టర్లు ఎ.నరేందర్‌బాబు, ఎస్.శశిధర్ రావు, చందా శ్రీనివాస్, పైళ్ల రమేష్‌రెడ్డి అభినందించారు.

'గీతాంజలి' విద్యార్థుల ప్రతిభ

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో నల్లగొండ పట్టణానికి చెందిన గీతాంజలి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో బి.నవ్యశ్రీ, జి.అక్షయ 992, నేహశ్రీ 991, ఎం.ఇందుమతి, టి.గణేష్ 990మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో పి.ఎల్లశ్రీ 989, జి.ఉమామహేశ్వరీ 983, ఆర్.బిందు 982 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఎస్‌డీ.ముదాబీర్ అఫ్నాన్ 468, జె.నందిని, ఎ.శోభ, బి.అర్పిత, వి.శ్వేత 467, కె.ఉమారాణి, బి.శ్రీవిద్య, వి.సౌమ్య, ఆర్.శ్రీమేఘనా, ఎం.అంజలి 466, బైపీసీ విభాగంలో ఆర్.ప్రవళిక 436, ఎ.శ్రీజ, డి.చరణ్‌తేజ 434, కె.వీరోనిక రాణి 433, టి.సింధు 431, ఎం.మంజుల 430 మార్కులు సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ టి.నరేందర్‌రెడ్డి, డైరెక్టర్లు సీహెచ్.మల్లారెడ్డి, ఎ.విమోచనరెడ్డి, ఎ.జనార్ధన్‌రెడ్డి అభినందించారు.



అంతంతగానే బోధన!

ప్రభుత్వ పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి విద్యార్థులపై సగటున ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం సుమారు రూ.36 వేలు ఖర్చుచేస్తోంది. అయితే గత విద్యా సంవత్సరాల్లో కొన్నిపాఠశాలలో విద్యార్థులకు తగ్గట్టుగా ఉపాధ్యాయులు, వసతులు లేకపోవటంతో నాణ్యమైన విద్య అందలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే వన్ నేషన్, వన్ ఎడ్యుకేషన్, వన్ పాలసీకి కేంద్రం అడుగులువేస్తోంది. దేశమంతా ఒకే గొడుకు కిందకు విద్యను తెచ్చి, పాఠశాలలపై పర్యవేక్షణ పెంచాలని, నాణ్యమైన విద్యను అందించాలనేది లక్ష్యం.

(ఆంధ్రజ్యోతి-కోదాడ)

● వన్ నేషన్, వన్ ఎడ్యుకేషన్ పాలసీకి కేంద్రం అడుగులు
● కొత్త విధానంతో ఇంటర్ స్థానంలో స్కూల్ ఎడ్యుకేషన్
● 5, 8వ తరగతిలో నోడిటెన్షన్ పాలసీ పునరుద్ధరణ
● విద్యార్థులను వెంటాడిన సాంకేతిక సమస్యలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలు 2,457 ఉండగా, ఆయా పాఠశాలల్లో సుమారు 1,35,000 విద్యార్థులు చదువుతున్నట్లు సమాచారం. నేటి నుంచి వేసవి సెలవులు ప్రకటించగా, వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం(జూన్) నాటికి 2025 నూతన జాతీయ విద్యావిధానం అమలుకు కసరత్తు చేస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు.

నూతన విద్యావిధానంతో మార్పులు

జాతీయ విద్యావిధానం(ఎన్ఈపీ) 2020 అమలువిషయంలో ఇప్పటివరకు దేశవ్యాప్తంగా కొంతమేర విద్యలో పురోగతి కనిపిస్తున్నా, ఇది రాష్ట్రాలకు వేర్వేరుగా అమలవుతోంది. ఈ నేపథ్యంలో నూతన జాతీయ విద్యావిధానం(ఎన్ఈపీ)2025 ప్రకారం వచ్చే విద్యాసంవత్సరంలో దేశంలో వన్ నేషన్, వన్ ఎడ్యుకేషన్, ఎన్ పాలసీ నిబంధన మేరకు 5+3+3+4 విద్యానిర్మాణం అమలు చేయాలనేది కేంద్రం లక్ష్యం. అంతేకాక 5, 8వ తరగతిలో ఇప్పటివరకు నోడిటెన్షన్ విధానంలేదు. నూతన విద్యావిధానం ప్రకారం ఆయా తరగతుల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు నోడిటెన్షన్ విధానం అమలుకు సిద్ధమవుతోంది. ప్రసుత్తం రాష్ట్రంలో అమలవుతున్న 5+2+3+2(5వ తరగతి వరకు ప్రైమరీ, 7వ తరగతి వరకు అప్పర్ ప్రైమరీ, 10వ తరగతి వరకు హైస్కూల్, ఆ తర్వాత ఇంటర్ విద్య అమలులో ఉంది.) 2025 ఎన్ఈపీ అమలయితే వచ్చే విద్యాసంవత్సరం నుంచి 5+3+3+4 విధానం(5తరగతి వరకు ప్రీ ప్రైమరీ, 8వ తరగతి వరకు అప్పర్ ప్రైమరీ, 9 నుంచి ఇంటర్ వరకు సెకండరీ ఎడ్యుకేషన్) అమలు చేయాలని కేంద్రం చూస్తోంది. తొలి ఐదేళ్లలో అంగన్‌వాడీ, ప్రీ స్కూల్ మూడేళ్లు, ఒకటి, రెండు తరగతులు. తర్వాత మూడేళ్లు 3,4,5 తరగతులు, మరో మూడేళ్లు 6,7,8 తరగతులు ఉంటాయి. చివరి నాలుగేళ్లలో సెకండరీ ఎడ్యుకేషన్ కింద 9, 10, 11, 12 తరగతులుంటాయి. ఇప్పటికే 2024-25 విద్యాసంవత్సరంలో 3, 6 తరగతుల్లో సిలబస్ మార్పులు జరిగాయి. ఇతర తరగతుల్లో నూతన విద్యావిధానం ప్రకారం మార్పులు ఉండవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. మాతృభాషలో బోధన, టెక్నాలజీ వాడకం పెంచటం, మల్టీ డిసిప్లినరీ ఎడ్యుకేషన్ కాన్సెప్ట్‌పై దృష్టి పెరగనుంది. నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ అమలు జరుగనుంది. ఇప్పటికే అకాడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ అమలు ప్రారంభమైంది. అంతేకాక విద్యార్థులకు కాంపిటెన్సీ ఆధారిత ప్రశ్నల(సీబీక్యూఎస్) మార్పులు కనిపిస్తున్నాయి. కొత్త మాడ్యూల్‌తో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు.

ఎదుర్కొన్న సమస్యలు

తరగతి గదిలో ఒకరకమైన బోధనతో విద్యార్థుల కొంత ఇబ్బందులు పడినట్లు చెబుతున్నారు. ఎక్కువ సేపు బోధనతో విద్యార్థుల దృష్టి స్థానం తగ్గింది. విద్యార్థులకు సరిపడా కంప్యూటర్, ఇంటర్నెట్ సౌకర్యాలు లేకపోవటంతో సాంకేతిక లోపాలు, ఇంటర్నెట్ సమస్యలు విద్యార్థులపై ప్రభావం చూపాయి. అదేవిధంగా ఉపాధ్యాయుల సంఖ్య కొన్ని పాఠశాలలో తక్కువ ఉండటంతో బోధన సక్రమంగా అందక విద్యార్థులు ఇబ్బందులు పడినట్లు నిపుణులు పేర్కొంటున్నారు.

● ప్రతి రోజూ నాకు ఒక పాఠం



గత సంవత్సరం విద్యార్థులతో గడిపిన ప్రతిరోజూ నాకు ఒక పాఠం. విద్యార్థుల చురుకుదనం, వారి ప్రశ్నలు, ఆలోచనా విధానం నన్ను ప్రభావితం చేశాయి. కొందరు విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శిస్తూ ప్రాజెక్టులు, కథనాలు, చిత్రలేఖనంలో అద్భుతప్రతిభ చూపటం ముచ్చటేసింది. మరికొందరు విద్యార్థులు గణిత, భౌతికశాస్త్రం వంటి అంశాల్లో లోతుగా ఆలోచిస్తూ అసాధారణమైన ప్రశ్నలు వేయటం అబ్బురపరిచింది. కొత్త జాతీయ విద్యావిధానంతో విద్యార్థులకు మంచి విద్య అందనుంది.

- జానకి రామయ్య, టీచర్

బోధన ఇలా

2024-25 విద్యాసంవత్సరంలో చొరవతో కూడిన బోధన జరిగిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. విద్యార్థులను చర్చల్లో పాల్గొనేలా ప్రశ్నలడిగే విధానం ద్వారా వారిలో ఆసక్తి పెంచామంటున్నారు. ప్రయోగాలు, ప్రాజెక్టులు వంటి అనుభవాత్మక బోధనతో పాఠ్యాంశాలు సులభంగా చొచ్చుకుపోయాయి. సాంకేతిక ఆధారిత బోధన, డిజిటల్ పాఠాలు, స్లైడ్ ప్రజెంటేషన్లు, ఆన్‌లైన్ విద్యా వనరులు వాడటంతో బోధన ప్రభావవంతంగా మారిందంటున్నారు. విభిన్న మాధ్యమాల వాడకం, వీడియోలు,ఆడియోలు, విజువల్స్ వాడటంతో పాఠాలు ఆకర్షణీయంగా మారినట్లు పేర్కొంటున్నారు.

కార్పొరేట్ కళాశాలలకు చెక్

ప్రస్తుతం స్కూల్, ఇంటర్ ఎడ్యుకేషన్ వేర్వేరుగా అమలవుతున్నాయి. కొత్త విధానం అమలు చేస్తే ప్రత్యేకంగా ఇంటర్ అనేది లేకుండాపోతుంది. ప్రస్తుతం గురుకులాల్లో అమలవుతున్న ఎన్ఈపీ విద్యావిధానమే. ఆతరహాలోనే ఎన్‌పీఈ విధానం అమలుచేస్తే పర్యవేక్షణ సులభంకావడంతో పాటు సర్కారుపై ఆర్థిక భారం తగ్గుతుందని, కార్పొరేట్ ఇంటర్ కళాశాలకు చెక్‌పడే అవకాశం ఉంటుంది. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంతో పాటు తల్లిదండ్రులపై భారం తగ్గుతుందని కేంద్రం భావిస్తోంది. అంతవరకు బాగానే ఉన్నా విద్య ఉమ్మడి జాబితాలో ఉండటం ఎన్ఈపీ ఎడ్యుకేషన్ పాలసీ అమలుచేస్తే, తమ ప్రాధాన్యం తగ్గుతుందని బీజేపేతర రాష్ట్రాలు నూతన విద్యావిధానం అమలుకు సుముఖత చూపటంలేదు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నూతన ఎన్ఈపీ అమలు కానుంది. కాగా ఎన్ఈపీ చర్య నేపథ్యంలో ఇంటర్‌వ్యవస్థను ఎత్తివేస్తేనే నయమని విద్యావేత్తలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం నుంచి ఇతరనిధులు అందాలంటే తప్పని సరిగా ఎన్ఈపీ విధానానికి ఒప్పుకోవాల్సిన పరిస్థితి. దీంతో వచ్చే విద్యాసంవత్సరంలో 5+3+3+4 విధానం అమలవుతుందని నిపుణులు చెబుతున్నారు.

ప్రైవేట్ వైపు తల్లిదండ్రుల మొగ్గు

నల్లగొండ, సూర్యాపేట జిల్లాలోని ప్రభుత్వ, మండల పరిషత్, గిరిజన సంక్షేమ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 2,457 ఉన్నాయి. 2023-24 విద్యా సంవత్సరంలో 1 నుంచి 5వ తరగతి వరకు ప్రభుత్వపాఠశాలలో 60,263 మంది విద్యార్థులు ఉంటే, ప్రైవేట్ పాఠశాలలో 72,217 మంది నమోదయ్యారు. ఇదిలా ఉంటే ప్రభుత్వ పాఠశాలలో పోల్చితే ప్రైవేట్ పాఠశాలలో వసతులు అధికంగా ఉంటున్నాయి. దీంతో కొంత మేర ప్రభుత్వ పాఠశాలలో పోల్చితే ఉత్తీర్ణతలో ప్రైవేట్‌లు ముందువరుసలో ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు. అందుకు తగ్గట్టుగా ఫీజులు అధికంగా ఉంటాయి. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన ఉచిత విద్య అందిస్తున్నా తల్లిదండ్రులు ఎందుకు ప్రైవేట్ బాటపడుతున్నారో అర్థంకాని ప్రశ్న అంటున్నారు.

అక్కడక్కడ ఉపాధ్యాయుల కొరత ఉన్నా, నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందంటున్నారు. ఈ విద్యా సంవత్సరంలోనైనా తల్లిదండ్రులు ఆలోచన చేసి ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపి, తమపై ఆర్థికభారం తగ్గించుకోవడమే కాక వృత్తినైపుణ్యం పొందిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందుకుని, పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని వారు సూచిస్తున్నారు.

అదేవిధంగా ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఉపాధ్యాయుల నియామకాలను చేపట్టి, తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచాలని కోరుతున్నారు.

టీచర్లకు శిక్షణతో
నాణ్యమైన విద్య

ఆంధ్రజ్యోతి జన వాక్యం

తెలంగాణ ప్రభుత్వం వేసవిలో ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చి విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు సన్నాహాలు చేపడుతున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి ఆదేశాలు జారీచేశారు. జిల్లా, మండలస్థాయిలో నైపుణ్యంగల శిక్షకు(రిసోర్స్ పర్సన్స్)లను గుర్తించాలని సూచించారు. దీనిపై దేవరకొండ నియోజకవర్గంలో ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, మేధావులు, డాక్టర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను తెలిపారు.

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)


విద్యాశాఖ నిర్ణయం మంచిదే



వేసవిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమం చేపట్టడం మంచి పరిణామం. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతాయి. మంచి బోధన చేస్తారు. ఫలితాలు కూడా మంచిగా వస్తాయి. టీచర్లు సద్వినియోగం చేసుకోవాలి

అంకం చంద్రమౌళి, రిటైర్డ్ హెచ్ఎం, దేవరకొండ

విద్యా బోధన మెరుగవుతుంది



ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే నాణ్యమైన విద్యా బోధన చేస్తున్నారు. కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేయడం అభినందనీయం. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన అందించేందుకు దోహదపడుతుంది.

డాక్టర్ దూదిపాల వేణుధర్‌రెడ్డి,
ప్రముఖ డాక్టర్ దేవరకొండ

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు నాణ్యమైన విద్య



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మంచి విద్యనందిస్తున్నారు. కొండమల్లేపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో వెయ్యికిపైగా విద్యార్థులు చదువుకుంటూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తే మంచిదే.

వస్కుల కుమారి, కొండమల్లేపల్లి

కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా



కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. ఢిల్లీ, కేరళ తరహాలోనే ప్రభుత్వం సరికొత్త బోధన అందించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమం చేపట్టారు. దీంతో ఫలితాలు వస్తాయి. ప్రభుత్వ నిర్ణయం హర్షనీయం.

నాగేశ్వర్‌రావు, ప్రధానోపాధ్యాయుడు,
కొండమల్లేపల్లి ఉన్నత పాఠశాల

మావోయిస్టులను చర్చలకు పిలవాలి

● రాష్ట్ర ప్రభుత్వంతో స్నేహపూర్వకంగా ఉంటూనే సమస్యలపై పోరాడతాం ● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మోత్కూరులో మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

మోత్కూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు ఒక మెట్టు దిగి ప్రభుత్వంతో చర్చలకు సిద్ధమని ప్రకటించినందున కేంద్ర ప్రభుత్వం వారిని చర్చలకు ఆహ్వానించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలోని కేఆర్ భవన్‌లో నిర్వహించిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మావోయిస్టులను లేకుండా చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిషా ప్రకటించడాన్ని తప్పుపట్టారు. మావోయిస్టులైనా, మరెవరైనా తప్పు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి తప్ప, వారిని చంపే అధికారం అమిత్‌షాకుగాని, ప్రభుత్వానికిగాని ఎవరిచ్చారని ప్రశ్నించారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధంగా ఉన్నందున ప్రభుత్వం వారిని చర్చలకు ఆహ్వానించి సమస్యలపై చర్చించాలన్నారు. మోదీ పాలనలో భారత్ సంపన్న దేశంగా మారిందని చెప్పడాన్ని ప్రస్తావిస్తూ సంపన్న దేశాల జాబితాలో మన దేశం 109వ స్థానంలో ఉందన్నారు. మోదీ ప్రభుత్వం రాష్ట్రాలనే కాదు దేశాన్నికూడా విచ్ఛిన్నం చేయజూస్తోందని, జనాభా ప్రాతిపదికన పార్లమెంటు స్థానాలు పెంచాలనడం అందులో భాగమేనని ఆరోపించారు. జనాభా ప్రాతిపదికన పార్లమెంటు స్థానాలు పెంచితే ఉత్తరాదిలో సీట్లు పెరిగి, దక్షణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గుతాయని, దాంతో ఉత్తరాది రాష్ట్రాలకే కేంద్ర అధికారం శాశ్వతం చేసే కుట్ర జరుగుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వంతో స్నేహపూర్వకంగా ఉంటూనే ప్రజా సమస్యలపై పోరాడతామన్నారు. రానున్న ఎన్నికల్లో ఏ పార్టీతోనైనా సీట్ల సర్దుబాటు చేసుకోవాలనుకుంటే ముందుగానే చేసుకుంటామని, సర్దుబాటు కుదరకపోతే పోటీ చేస్తామన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాశికంటి లక్ష్మీనర్సయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చేడె చంద్రయ్య, కళ్లెం కృష్ణ, ఎండీ.ఇమ్రాన్, ఉప్పల ముత్యాలు, కుసుమని హరిశ్చంద్ర, బండి జంగమ్మ, కొల్లూరి రాజయ్య, గాలయ్య, చెక్క వెంకటేష్, బోద సుదర్శన్, ఏశాల అశోక్, మండల కార్యదర్శి అన్నెపు వెంకట్, గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు చాపల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడేది ఎర్ర జెండాయే

ఆలేరు రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండాయేనని కూనమనేని సాంబశివరావు అన్నారు. ఆలేరు మండలం కొలనుపాకలో ఇళ్ల స్థలాలకోసం ఆ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షా శిబిరంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలందరికీ ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్, అరుట్ల సుశీలా దేవి పాల్గొన్నారు.

సన్న బియ్యం..
పేదలకు వరం

● భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి

రామన్నపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సన్నబియ్యం పథకం.. పేదలకు వరమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం రామన్నపేట మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన కళ్లెం భిక్షమయ్య కుటుంబ సభ్యులతో కలిసి సన్న బియ్యంతో వండిన ఆహారాన్ని కలెక్టర్ హనుమంతరావుతో కలిసి భుజించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సన్న బియ్యం పథకం అమలు చేసి, నేడు పేదవారి ముఖంలో ఆనందం చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, తాజా మాజీ సర్పంచ్ గోదాసు శిరీష, తహసీల్దార్ లాల్ బహదూర్, ఎంపీడీవో భాక్య యాకుబ్ నాయక్, వనం హర్షిణి, చంద్రశేఖర్, జినుకుల ప్రభాకర్, ఎండీ రెహాన్, పున్న జగన్మోహన్, రామిని రమేష్, జమీరుద్దీన్, అక్రం, నోముల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



భోజనం చేస్తున్న ఎంపీ చామల, ఎమ్మెల్యే వేముల

తాను కన్నుమూసి..
మరొకరి కంటి వెలుగయ్యాడు

● 'మనం' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నగేశ్ నేత్రాల దానం



నేత్రాలను సేకరించిన ఐ డోనేషన్ కౌన్సిలర్ బృందం

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తను కన్నుమూసినా.. మరొకరి కంటికి వెలుగయ్యాడు. తన కంటి దానంతో మరొకరి కంటిచూపయ్యాడు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన మంద నగేశ్ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. దీంతో 'మనం' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు దైద నాగరాజు చొరవతో నగేశ్ నేత్రాలను దానం చేసేందుకు అతని కుటుంబ సభ్యులు అంగీకరించారు. నేత్రదానంపై ఐ డొనేషన్ కౌన్సిలర్ చిరునోముల చంద్రశేఖర్ కాలనీవాసులకు అవగాహన కల్పించారు. నగేశ్ నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని అగర్వాల్ ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ అడ్వకేట్ కేవీ ప్రసాద్, ఎండీ డాక్టర్ హరినాథ్, పుల్లారావు, సభ్యులు ప్రనూష, నితీశ, సామాజిక కార్యకర్త ఏచూరి శైలజ, ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు యాదయ్య, విజయ్‌కుమార్ తదితరులు నగేశ్ మృతికి సంతాపం తెలిపారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపైన కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం దళార్చనలు, నృసింహుడికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామిని వేదమంత్రాలతో పంచామృతభిషేకం చేసిన అర్చకులు సిందూరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చన చేపట్టారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణపర్వాలను పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. కొండపైన అనుబంధ శివాలయంలో శ్రీపర్వతవర్థిని సమేత రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటికమూర్తులకు నిత్యపూజలు, నిత్య రుద్రహవనం, సీతారామచంద్రస్వామి వసంతోత్సవాలు శైవగమ పద్ధతిలో కొనసాగాయి. అనుబంధ పాతగుట్ట ఆలయం విష్ణుపుష్కరిణి కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు.



ఆంజనేయుడికి హారతి ఇస్తున్న అర్చకుడు

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం వద్దు

సూర్యాపేటటౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): హోటల్ నిర్వాహకులు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు తీసుకుంటామని సూర్యాపేట మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సాయిబృందావన్ బార్‌అండ్ రెస్టారెంట్‌లో మునిసిపల్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి రిఫ్రిజిరేటర్‌లో నిల్వ ఉన్న చికెన్‌ను గుర్తించి రూ.5000 జరిమానా విధించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, సురేష్, వెంకన్న పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారుల బృందం

ఇంటర్‌లో బాలికలదే పైచేయి

(5వపేజీ తరువాయి)

ఉత్తీర్ణత సాధించగా, ప్రస్తుతం 56.65శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రథమ సంవత్సరం ఒకేషనల్ విభాగంలో 1,679 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 807 మంది ఉత్తీర్ణ సాధించారు. గత ఏడాది 39శాతం ఉత్తీర్ణత నమోదుకాగా, ఈ ఏడాది 49శాతం సాధించారు. ద్వితీయ సంవత్సరంలో జనరల్ విభాగంలో 6,152 మంది పరీక్షకు హాజరుకాగా, 4133 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 2,801 మంది పరీక్ష రాయగా 1,618 మంది (57.77శాతం), బాలికలు 3,351 మంది పరీక్ష రాయగా 2,515 మంది (75.05 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో జిల్లాలో 67.18శాతం ఉత్తీర్ణత రాగా, గత ఏడాది 62శాతం కంటే 5శాతం అధికంగా ఉత్తీర్ణత నమోదైంది. ఒకేషనల్ విభాగంలో 1,366 మంది పరీక్ష రాయగా, 850 మంది (62.23 శాతం) ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది 53శాతం కంటే 9శాతం అధికంగా ఉత్తీర్ణత నమోదైంది. డీఐఈవో భానునాయక్ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ

దేవరకొండ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండలోని హనుమాన్‌నగర్‌లో పట్టపగలు చోరీ జరిగిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. హనుమాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న రమేష్, అతని భార్య ఇంటికి తాళంవేసి ఎవరి పనులకు వారు వెళ్లిపోయారు. మధ్యాహ్నం 12గంటల సమయంలో దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి రూ.6లక్షలు, మూడు తులాల బంగారం అపహరించుకుపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దేవరకొండ సీఐ నర్సింహులు, ఎస్ఐ రమేష్‌లు సంఘటన స్థలానికి చేరుకొని సీసీ కెమెరాల ఆధారంగా విచారణ జరుపుతున్నారు.

చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాలలో మంగళవారం పట్టపగలు ఓ ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. చిట్యాలకు చెందిన షానూర్ మంగళవారం మధ్యాహ్నం భువనగిరిరోడ్‌లోగల తన బైక్ పార్క్ చేయగా గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుపోయాడు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో షానూర్ ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్వీస్ వైర్ల దొంగల అరెస్ట్

తిప్పర్తి: మోటర్ సర్వీస్ వైర్లను చోరీ చేసిన దొంగలను మంగళవారం నల్లగొండ జిల్లా తిప్పర్తి పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 20న తిప్పర్తి మండలంలోని పెద్దసూరారం గ్రామానికి చెందిన కోట్ల జాలేందర్‌రెడ్డి అనే రైతు పొలం వద్ద బోరు సర్వీస్ వైర్లు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆయన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టగా, నల్లగొండ పట్టణ పరిధిలోని రామ్‌నగర్‌కు చెందిన అన్నపూరి రవి, నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామానికి చెందిన సిగ ఉపేందర్‌లు చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.సాయి ప్రశాంత్ తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో కేఎల్ఎన్ విద్యార్థుల ప్రతిభ



మిర్యాలగూడలో షేక్ ఆస్రా(468/470), కే. మేఘన(438/440), కు మ్మరి వంశీ(992/1000), ఎస్. పావని(990/1000)లను అభినందిస్తున్న కేఎల్ఎన్ కళాశాల యాజమాన్యం

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని కేఎల్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. మంగళవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ బికుమళ్ల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రథమ సంవత్సర ఎంపీసీ విభాగంలో షేక్ ఆస్రా 468/470, బైపీసీ విభాగంలో కే. మేఘన 438/440 మార్కులతో రాష్ట్రస్థాయిలో ఫలితాలు సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో కుమ్మరి వంశీ 992/1000, బైపీసీ విభాగంలో ఎస్. పావని 990/1000 మార్కులు సాధించారన్నారు. ద్వితీయ సంవత్సర బైపీసీలో ఎస్.సమీనా, ఎస్‌కే.షఫియా 985/1000 మార్కులు సాధించారన్నారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 40 మంది విద్యార్థులు 460కి పైగా మార్కులు సాధించగా, బైపీసీలో 10 మంది విద్యార్థులు 430కి పైగా మార్కులు సాధించారన్నారు. ద్వితీయ సంవత్సర ఎంపీసీలో 20 మంది విద్యార్థులు, బైపీసీ విభాగంలో 15 మంది విద్యార్థులు 980కి పైగా మార్కులు సాధించారన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు పీఎల్ఎన్‌రెడ్డి, హన్మంతరెడ్డి, నరేందర్‌రెడ్డి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

'జయ' కళాశాల విజయకేతనం

సూర్యాపేటఅర్బన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో సూర్యాపేట జయ కళాశాల విద్యార్థులు 446 మార్కులకు పైగా 46 మంది, 450 మార్కులకు పైగా 71మంది విద్యార్థులు మార్కులు సాధించారని కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 980 మార్కులకు పైగా 13 మంది, 950కి పైగా 41 మంది విద్యార్థులు మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ బింగి జ్యోతి, పద్మ పాల్గొన్నారు.

జాహ్నవికి బైపీసీలో 990

కట్టంగూరు: ఇంటర్ బైపీసీ విభాగంలో కట్టంగూరుకు చెందిన బుడిగ జాహ్నవి 1000మార్కులకు గాను 990 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచింది. హైదరాబాద్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో చదువుతుంది. విద్యార్థినిని తల్లిదండ్రులు, స్థానికులు అభినందించారు.



విధుల్లో నిర్లక్ష్యం చేస్తే
కఠిన చర్యలు

జైళ్ల శాఖ హైదరాబాద్ రేంజ్ డీఐజీ డీ.శ్రీనివాస్

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని జైళ్ల శాఖ హైదరాబాద్ రేంజ్ డీఐజీ డీ.శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం ఆయన జిల్లా జైలును సందర్శించారు. జైలులో రికార్డులను పరిశీలించి ఖైదీల మెనూ, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం, పరిశుభ్రత, ఖైదీల పరివర్తనపై సిబ్బందితో చర్చించారు. జైలు అధికారులు ఖైదీలపట్ల వ్యవహరిస్తున్న తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. నిర్వహణలో పలు సమస్యలు ఆయన దృష్టికి రావడంతో అందుకు సంబంధించిన ఇద్దరు అధికారులను (సబ్ జైలర్లు) అప్పటికప్పుడు బదిలీచేశారు. వారు 24గంటల లోపల ఇక్కడి నుంచి రిలీవ్ కావాలని, ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని, లేదంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాకుండా మరికొంత సిబ్బందికి మెమెలు జారీ చేయాలని సూపరింటెండెంట్ ప్రమోద్‌కు ఆదేశాలు జారీ చేశారు. జైలులో జరుగుతున్న కార్యక్రమాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు ఆయన పేర్కొన్నట్లు సమాచారం. ఆయనవెంట జైలు సూపరింటెండెంట్ ప్రమోద్, జైలర్లు నరేష్, బాలకృష్ణ ఉన్నారు.

ఒకరికి బదులు మరొకరు

● ఓపెన్ ఇంటర్ పరీక్షలో గందరగోళం

హుజూర్‌నగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ ఇంటర్ పరీక్షలో ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాసిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ చరమందరాజు తెలిపారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేళ్లచెరువు మండలం రేవూరుకు చెందిన బండారు వీరబాబు ఓపెన్ ఇంటర్ పరీక్షల నిమిత్తం చెడపంగు భాస్కర్ అడ్మిషన్ వేశారు. ఈ నెల 20న ఓపెన్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం కాగా వీరబాబుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష సెంటర్ కేటాయించారు. మంగళవారం పొలిటికల్ సైన్స్ పరీక్ష ఉండగా వీరబాబుకు వరుసకు సోదరుడు అయిన అరిగిల చిరంజీవిని తనకు బదులు పరీక్ష రాస్తే ప్రతి పరీక్షకు రూ.1000 ఇస్తానని చెప్పగా, అందుకు చిరంజీవి ఒప్పుకుని హాల్‌టికెట్ తీసుకుని వెళ్లి మంగళవారం పరీక్ష రాస్తుండగా సుమారు ఉదయం 11గంటలకు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ పిన్ని మధు చిరంజీవిపై అనుమానం వచ్చి పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. దాంతో పిన్ని మధు ఫిర్యాదు మేరకు ఎస్ఐ ముత్తయ్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చరమందరాజు తెలిపారు. వారిద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా, ఒకరికి బదులు మరొకరు పరీక్షలు రాసినా తీవ్రమైన చర్యలు ఉంటాయని సీఐ హెచ్చరించారు.

మద్యం మత్తులో
వాహనాలు నడిపితే జైలుకే

సూర్యాపేటక్రైం, ఏప్రిల్ 22, (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడిపితే జైలుకే అని సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ ఆర్. సాయిరాం తెలిపారు. ఈ నెల 21వ తేదీన సూర్యాపేటలోని పలు ప్రాంతాల్లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేయగా ఆరుగురు మోతాదుకుమించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడినట్లు తెలిపారు. వారిని మంగళవారం సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బీవీ రమణ ఎదుట హాజరుపర్చగా వారిలో ఒకరికి ఒకరోజు జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా, మిగిలిన ఐదుగురికి రూ.6 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు వివరించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే జైలు వెళ్లాల్సి ఉంటుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతాయన్నారు.

యువకుడి ఆత్మహత్య

ఆలేరు రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలో యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల ప్రకారం.. కొలనుపాకకు చెందిన భాను (21) ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సాయంత్రం గ్రామశివారులోని పెంజేరువు వాగు వద్ద చింతచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు. ఈవిషయపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రజనికర్ తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

17 రోజులు.. ఆరు అడుగులు

● పెరిగిన మూసీ నీటిమట్టం



629అడుగులకు చేరిన నీటి మట్టం

కేతేపల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వేసవి ఎండల తీవ్రతకు ప్రాజెక్టుల నీటినిల్వలు తగ్గడం, చెరువులు, కుంటలు ఎండిపోవడం సర్వసాధారణం. ఇందుకు భిన్నంగా మండు వేసవిలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద నీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతూ వస్తుంది. 645అడుగులు (4.46టీఎంసీలు)పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టు నుంచి యాసంగి సీజన్‌లో ఆయకట్టుకు ఈ నెల మొదటి వారంలో సాగునీటి విడుదలను నిలిపి వేసే నాటికి ప్రాజెక్టు నీటిమట్టం 622.91అడుగులు (0.66టీఎంసీలు) కనిష్ట స్థాయికి పడిపోయింది. ఈక్రమంలో మూసీ నది ఎగువనగల ధర్మారెడ్డి కాల్వ, పిలాయిపల్లి, అసిఫ్‌నెహర్ కత్వలు, ఇతర ఫీడర్ ఛానళ్ళకు హైదరాబాద్ నగరం నుంచి వచ్చే డ్రైనేజీ, వృథా నీటిని మళ్లించడంతో చిట్యాల, రామన్నపేట, నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలంలోన్ని పలు చెరువులు, కుంటలు నిండి ప్రస్తుతం అలుగులు పోస్తున్నాయి. ఆయా చెరువులు, కుంటల అలుగుల నుంచి వచ్చే నీరంతా ప్రస్తుతం దిగువన మూసీ ప్రాజెక్టుకు చేరుతుండడంతో గత 17 రోజులుగా ప్రాజెక్టుకు దాదాపు 300 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. దీంతో వారం రోజుల క్రితం 626.90 అడుగులకు (1.02టీఎంసీలు) చేరిన ప్రాజెక్టు నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి మరో మూడు అడుగుల మేర పెరిగి 629.10అడుగులు(1.28టీఎంసీలు)గా నమోదైంది. ఎగువ నుంచి 614క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 51.43క్యూసెక్కుల మేర నీరు లీకేజీలు, ఆవిరి రూపంలో వెళుతుంది. కాగా గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టు నీటిమట్టం 622.10అడుగులు(0.60టీఎంసీలు)గా, ఇన్‌ఫ్లో 360క్యూసెక్కులుగా ఉంది.

CLASSIFIEDS

NAME CHANGE
★ TANNEERU ASWANI KUMAR S/O RAMULU TANNEERU, R/o. CHAITANYA NAGAR SCHOOL, HUZURNAGAR, NALGONDA. ANDHRA PRADESH. 508204, INDIA HAVE CHANGED MY NAME TO TANNEER ASHWINI KUMAR
AJY_224228

NAME CHANGE
★ I MOHAMMED ABDUL JAMEEL, H/o. SHABANA AZMI, Was given divorce to SHABANA AZMI, R/o. NALGONDA and Married to YASMEEN BEGUM (Present Wife)
AJY_218961

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

4 Lines CLASSIFIED
NLG+SRPT+YGT (3Dist)
210/- Only
Extra Line 45/- Only
For Ads Contact :
NALGONDA DIST
9985413365
9985413656
SURYAPET DIST
9703618713,
9985401015
YADADRI BHONGIRI DIST
9985410384

వంట సామగ్రి పంపిణీ

చిట్యాల, ఏప్రిల్22, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకం కోసం మంజూరైన వంటపాత్రలను మంగళ వారం ఎంఈవో పోనుగోతు సైదానాయక్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ వడ్డేపల్లి సరిత, సీసీవో వరలక్ష్మి, సీఆర్పీలు మేడి ప్రవళిక, గుడిపాటి జాన్, రంగరాజు జయకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈగా నరేష్



శాలిగౌరారం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆర్‌డబ్ల్యూఎస్ మండల ఇన్‌చార్జి ఏఈగా నకిరేకల్‌లో పనిచేస్తున్న కడారు నరేష్ నియమితులయ్యారు. గతంలో ఇక్కడ ఏఈగా పనిచేసిన గంజి రాంబాబు సస్పెండ్ అయ్యాడు. రాంబాబు స్థానంలో ఏఈగా నరేష్ బాధ్యతలు స్వీకరించారు.

లెప్రసీ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి



ఫ్రాన్సిస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు మోహన్ రెడ్డి, తదితరులు

నల్లగొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని లెప్రసీ కాలనీ సమస్యల పరిష్కారానికి మంత్రి సహకారంతో కృషి చేస్తానని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి అన్నారు. లెప్రసీ కాలనీలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో పేద ప్రజలందరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో 3వ వార్డు ఇన్‌చార్జి గాలి నాగరాజు, నాయకులు గుండెబోయిన యాదయ్య, బోగరి భిక్షం, చంద్రయ్య, లింగయ్య, అనిల్, కొమ్ము జానీ, ఖాసీం, దేవ, రాజు, సైదులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటానికి నివాళి

రోమన్ క్యాథలిక్ మతపెద్ద బిషప్ పోప్ ఫ్రాన్సిస్ మృతి పట్ల కాంగ్రెస్ శ్రేణులు సంతాపం తెలిపారు. మంగళవారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, తిప్పర్తి మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, నల్లగొండ మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నాయకులు కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, అనుపరెడ్డి, సుమన్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి

కట్టంగూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించి పాఠశాలలను బలోపేతానికి ప్రజలు సహకరించాల దుగినవెల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు మురళయ్య కోరారు. దుగినవెల్లి గ్రామంలో ఇంటింటికీ తిరిగి బడిబాట కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల పేర్లు నమోదు చేసుకున్నారు.

మునుగోడు రూరల్: మండలంలోని పలివెల జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ముందస్తు బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెరిక నరసింహా, ఉయ్యాల యాదయ్య, విలయం రాజు, గేర నరసింహా, వెంకన్న, రాఘవేంద్ర, అంజిలమ్మ, కవిత, సావిత్ర పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

కట్టంగూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు గోలి ప్రభాకర్ అన్నారు. మండలంలోని కురుమర్తి, సత్యనారాయణపురం గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు.కార్యక్రమంలో ఉట్కూరి వెంకన్న, షేక్ హమీద్, మౌనిక తదితరులు ఉన్నారు.

నిష్పక్షపాతంగా పథకాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రం

మునుగోడు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో నిష్పక్షపాత వైఖరి చూపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గురిజరామచంద్రం డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిబంధనలను పారదర్శకంగా అమలు చేయాలన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన వరిధాన్యం కొనుగోలులో ఎలాంటి అసౌకర్యాలు కలిగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన బాధిత రైతులకు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బొమ్మరబోయిన లాలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ లింగయ్య, మందుల పాండు, ఉప్పునూతల రమేష్ పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వాసు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన మేడి వాసు నియామకమయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ ఆదేశాల మేరకు మేడి వాసు నియామకాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు మామిడి సైదులు మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ. తనపై విశ్వాసంతో అప్పజెప్పిన బాధ్యతను శక్తివంచన లేకుండా నిర్వహిస్తానని నియామకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

చిట్యాలరూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నర్ర వినోదామోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని వట్టిమర్తిలో మంగళవారం పోషణపక్షం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

● శాలిగౌరారం : మండలం చిత్తలూరు గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్షం నిర్వహించారు. గ్రా మంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్ పి. జ్యోతి అంగన్వాడీ టీచర్లు తరాల శోభారాణి, లలిత, వసంత, అనిత పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

నకిరేకల్, ఏప్రిల్ 22, (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి ప్రాణ వాయువు కాపాడుకోవాలని పర్యావరణ వేత్తా పాలవరపు సంఘ మిత్రుడు అన్నారు. అంతర్జాతీయ ధరిత్రి దినోత్సవం సందర్భంగా నకిరేకల్ వాసవిసేవా నికేతన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వాసవి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వాసవిసేవా సమితి అధ్యక్షుడు కోటగిరి రమేష్, వీరవెల్లి శ్రీధర్, గజ్జెల విద్యాసాగర్, పాలవరపు సంతోష్, రామకృష్ణ పాల్గొన్నారు.

పౌర సరఫరాల శాఖ అధికారికి సన్మానం

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నూతన పౌర సరఫరాల శాఖ అధికారి వెంకటేష్‌ని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు ఆయన కలిసి వారిలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కర్నాటి నారాయణ, జనరల్ సెక్రటరీ రేపాల భద్రాద్రి రాములు, జూలకంటి ఇంద్రారెడ్డి, తేరేటిపల్లి హనుమంత్, కన్మంతరెడ్డి, కేశవరెడ్డి, తౌనుపునూరి వెంకటేశ్వర్లు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చడం అభినందనీయం

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడం అభినందనీయమని జిల్లా అడిషినల్ ఎస్పీ రమేష్ అన్నారు. శ్రీ జగిని టెక్స్‌టైల్స్ జగిని దంత వైద్యశాల ఆధ్వర్యంలో స్థానిక హెడ్ క్వార్టర్ ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జగిని సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో జగిని టెక్స్‌టైల్స్ అధినేత వెంకన్న టూటౌన్ ఎస్ఐలు సైదులు, ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది, రవి,వెంకన్న,జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ ఆధారిత బోధన

ప్రభుత్వ పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులకు అభ్యసనంలో ఇబ్బందుల్లేకుండా ఉండేందుకు ప్రభుత్వం కంప్యూటర్ ఆధారితంగా (ఏఐ-కృత్రిమ మేధస్సు) ప్రత్యేక తరగతులకు శ్రీకారం చుట్టింది.విద్యార్థుల సామర్థ్యం ఆధారంగా వారిని ఏ,బీ,సీ కేటగిరీగా విభజించి 'సీ' కేటగిరి విద్యార్థులకు కంప్యూటర్ బోధన చేస్తారు. ఈ కార్యక్రమానికి చిట్యాల మండలం నేరడ ప్రాథమిక పాఠశాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక కాగా, మార్చి 15న తరగతులు ప్రారంభించారు.
- (ఆంధ్రజ్యోతి,చిట్యాలరూరల్)



నేరడ ప్రాథమిక పాఠశాలలో పాఠ్యాంశాలు వింటున్న విద్యార్థులను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

- ఏఐతో విద్యార్థులు అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుకు దోహదం
- 3, 4, 5వ తరగతుల విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, గణితం బోధన
- పైలెట్ ప్రాజెక్టుగా నేరడ పాఠశాల

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 3,4,5వ తరగతుల విద్యార్థులు విద్యాభ్యాసంలో అభ్యసన సామర్థ్యం మెరుగుపరిచేందుకు కంప్యూటర్ ఆధారిత విద్యాబోధన (కృత్రిమమేధ)ఎంతగానో దోహదపడనుంది. 50 మంది కంటే ఎక్కువగా విద్యార్థులున్నా పాఠశాలకు 5 కంప్యూటర్లు అందించారు. ఒక్కో విద్యార్థి గంట సమయాన్ని కేటాయించి కంప్యూటర్ పాఠ్యాంశాలను అందిస్తున్నారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అందించేందుకు కంప్యూటర్ ఆధారిత బోధన ఉపయోగపడనున్నాయి. ఈ కంప్యూటర్ ఏఐ తరహా బోధనను విద్యార్థులు ఆసక్తిగా వింటున్నారు.

కంప్యూటర్ ఆధారిత బోధనల్లో తెలుగు, ఆంగ్లం, గణితం పాఠ్యాంశాలుంటాయి. తెలుగు, ఆంగ్లంలో పదాలు, వాక్యాలను చూస్తూ చదవాల్సి ఉంటుంది. విద్యార్థులు ఇయర్ ఫోన్ ద్వారా పదాలను పలకడంతో కంప్యూటర్ తప్పొప్పులను చూపుతుంది. మరోసారి అవకాశం కల్పిస్తుంది. దీంతో అభ్యసన సామర్థ్యం విద్యార్థులకు మెరుగుపడుతుంది. గణితంలో అంకెలను కూడికలు తీసివేతలు, గుణకారం, భాగాహారం చేయమని సూచించగా విద్యార్థులు సులభతరంగా నేర్చుకునేందుకు అవకాశముంటుంది. విద్యార్థులను కంప్యూటర్ ప్రశ్నలను సంధిస్తూ వారి నుంచి సమాధానాలను రాబడుతుంది. అంతేకాకుండా విద్యార్థులు అర్థం చేసుకుంటున్నారా లేదా కంప్యూటర్ గుర్తించి సులభతరమైన ప్రశ్నలు వేస్తూ జవాబులను రాబడుతుంది. తప్పుగా చెప్పినా కూడా మళ్లీ కంప్యూటరే తెలిపి మరోసారి ప్రశ్నలు సంధిస్తూ అర్థమయ్యేలా సూచిస్తూ సమాధానాలను రాబడుతుంది. వారి సామర్థ్యాన్ని బట్టి కంప్యూటర్‌లో లెవల్ పెరుగుతోంది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని ఉపాధ్యాయులు దగ్గరుండి పర్యవేక్షిస్తూ సలహాలు సూచనలందిస్తున్నారు. కంప్యూటర్ ఆధారిత బోధనలకు ప్రత్యేకంగా ఉపాధ్యాయుడిని నియమిస్తే రాబోయే రోజుల్లో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం మరింతగా అందిచవచ్చునని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.

పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక కావడం హర్షం



మండలంలోని విద్యలో వెనుకబడిన విద్యార్థులకు కం ప్యూటర్ ఆధారిత బోధనల కోసం (కృత్రిమ మేధ) నేరడ ప్రాథమిక పాఠశాలను ఎంపిక చేయడం అభినందనీయం. సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు పాఠశాలస్థాయి నుంచి అందించడం ద్వారా విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాన్ని పెరుగుతుంది. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు కంప్యూటర్‌ను నేర్చుకుంటే రాబోయే రోజుల్లో ఇబ్బందులుండవు. తమ పాఠశాలను పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టడంతో విద్యార్థులు ఎంతో ఆసక్తితో పోటీపడుతున్నారు.

- వల్లపు నాగరాజు,హెచ్ఎం,నేరేడ ప్రాథమిక పాఠశాల

కంప్యూటర్ బోధన ఆసక్తిగా ఉంది



కంప్యూటర్ ద్వారా బోధనఆసక్తిగా ఉన్నాయి. కంప్యూటర్ ప్రశ్నలు అడిగితే తాము చెప్పకపోతే సులభంగా ఉండేవి అడుగుతోంది. తెలుగు, ఆంగ్లంలో పదాలు, వాక్యాలు ప్రదర్శిస్తూ సమాధానాలు చెప్పగానే కరెక్టు అని వస్తుంది. గణితంలో అంకెలు, కూడికలు, తీసివేతలు, భాగాహారం, గుణకారాలను సందించడంతో తాము సులభంగా నేర్చుకునేలా ఉన్నాయి. మాకు అర్థమయ్యేలా పదాలన్నింటినీ చూపించడమే కాకుండా రానట్లయితే మరో మారు కంప్యూటరే ప్రశ్నలడిగి గుర్తిస్తుంది. సులభంగా అర్థం చేసుకునేలా ఉన్నది.

- అయితరాజు మధుర, 5వ తరగతి

అభ్యసన సామర్థ్యం మెరుగుపడుతుంది



విద్యలో వెనుకబడిన విద్యార్థులకు కంప్యూటర్ ఆధారిత బోధనలు చేపట్టడంతో వారి అభ్యసనా సామర్థ్యం మెరుగుపడుతుంది. కంప్యూటరే పదాలి చ్చి ప్రశ్నలు వేసి సమాధానాలను రాబడుతుండ డం ఒక వేళ విద్యార్థులు సమాధానలు చెప్పకపోతే సులభమైన పదాలిస్తుంది. విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి వారిని అంచనా వేసి కంప్యూటర్ ప్రశ్నలు సందిస్తుంది. ఒకవేళ సమాధానాలు చెప్పకపోతే దానంతట అదే మరోమారు ప్రశ్నలు వేస్తూ సమాధానాలు రాబడుతుంది. మొదట్లో విద్యార్థులు కంపూటర్ బోధనలు అంటే భయంతో ఉండేవారు. కొన్ని రోజులు పోయాక విద్యార్థులు పోటీ పడి మేమంటే మేము కూడా నేర్చుకుంటామని ఆసక్తిని చూపుతున్నారు.

- రంగా రామలింగయ్య, ఉపాధ్యాయుడు,నేరేడ ప్రాథమిక పాఠశాల

నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నివారణ

చిట్యాలరూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు నిబంధనలను పాటిస్తే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని నార్కట్‌పల్లి సీఐ కె. నాగరాజు అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా చిట్యాల పోలీస్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి వట్టిమర్తిలో అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వాహనాలను వేగంగా అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా నడిపితే ప్రమాదాల బారిన పడతారని అందుకు తప్పనిసరిగా నిబంధనలను పాటించినట్లయితే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. కార్యక్రమంలో చిట్యాల ఎస్ఐ ఎన్. ధర్మ, గ్రామస్తులు, వాహనదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సన్న ధాన్యానికి బోనస్ చెల్లించడంలో ప్రభుత్వం విఫలం

శాలిగౌరారం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వానాకాలంలో సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ అందరికీ చెల్లించడంలో విఫలమైనట్లు ఆమ్ ఆద్మీ పార్టీ రైతు సంఘం అధ్యక్షుడు యంపల్ల పురుషోత్తం రెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుడారు. ముఖ్యమంత్రి, మంత్రులకు ప్రచార ఆర్భాటంపై ఉన్న శ్రద్ధ, రైతులకు బోనస్ చెల్లించడం పై లేదన్నారు. ఆరు నెలలు గడిచి యాసంగి వచ్చిన గాని బోనస్ పైసలు రాలేదని, తక్షణమే ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మిస్ వరల్డ్ పోటీలను ఉపసహరించుకోవాలి



నిరసన తెలుపుతున్న మహిళా, ప్రజా సంఘాల నాయకులు

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో నిర్వహించే ప్రపంచ సుందరి పోటీలను నిర్వహించడాన్ని తక్షణమే ఉప సంహరించుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పజ్జూరు ఉపేంద్ర డిమాండ్ చేశారు. ప్రపంచ సుందరి పోటీలు మే 7 నుంచి 31 వరకు జరిగే పోటీలను వెంటనే ఉప సంహరించుకోవాలని ఐద్వా, పీఓడబ్ల్యూ, పీవైఎల్, డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూ సంఘాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నల్ల జెండాలతో నిరసన తెలుపుతూ రాస్తారోకో నిర్వహించారు. కార్యక్ర మంలో పీవైఎల్ జిల్లా కార్యదర్శి బీవీ చారి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి పోలే పవన్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలబోయిన వరలక్ష్మి కొండ అనురాధ, పాతూరి గోవర్ధన, ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, ఎస్.కె సుల్తానా పాల్గొన్నారు.

జన జాతరను జయప్రదం చేయండి



జన జాతర కరపత్ర అవిష్కరణలో పాల్గొన్న డాక్టర్ మీనయ్య

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : సామాజిక విప్లవ వీరులు మహాత్మా జ్యోతిబాపూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహించే జన జాతరను జయప్రదం చేయాలని డాక్టర్ అక్కినపల్లి మీనయ్య పిలుపునిచ్చారు. ఈ నెల 28న నల్లగొండ జిల్లా కేంద్రంలోని పెద్ద గడియారం సెంటర్లో నిర్వహించే పూలే, అంబేడ్కర్ జన జాతర జయప్రదం చేయాలని మంగళవారం స్థానిక ఎన్‌జీ కళాశాల ఆవరణలో వాకర్స్ సభ్యులు కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. జన జాతరకు ముఖ్యఅతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ చింతకింది కాసిం, బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మల్లెపాక వెంకన్న, చింతపల్లి వెంకన్న, సత్యం పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఓ హోటల్లో మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిధులుగా బీజేపీ నాయకులు చింతా సాంబమూర్తి, పేరాల శేఖర్‌జీ, డాక్టర్ జి మనోహర్‌రెడ్డి, తాడూరి శ్రీనివాస్, డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి పాల్గొని అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 25 వరక జిల్లా, నియోజక వర్గాల్లో, మండల కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

చండూరు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : తెలంగాణమలిదశ ఉద్యమం కోసం పోరాడిన ఉద్యమకారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుడు కల్లెం సురేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం చండూరులో విలేకరులతో మాట్లాడారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వృద్ధాప్యంలో ఆర్థిక భరోసా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఉద్యమకారులకు 20శాతం ప్రత్యేక వాటా కేటాయించాలని అన్నారు.

బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలి

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌జిల్లాలో ఈ నెల 27 న నిర్వహించే బహిరంగ సభ విజయ వం తం చేయాలని బీఆర్ఎస్ మండ లాధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి పిలుపు నిచ్చారు. బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం బహి రంగ సభ వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మరబోయిన నాగార్జున, మాజీ ఎంపిపీ నారబోయిన భిక్షం, మాజీ జడ్పీటీసీ తుమ్మల రాధ లింగస్వామి, మాజీ సర్పంచ్ సైదులు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

శాలిగౌరారం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ శాలిగౌరారం మండల కార్మిక విభాగం అధ్యక్షుడు మామిడి రమేష్ కోరారు. మండలకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాకీ వెంకటయ్య, రాచకొండ గణేష్, కోడిమాల శంకర్ పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : నిడమనూరు మండలంలో మల్లేశ్వరి మృతికి కారణమైన జానిరెడ్డి, ఇతర నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి కొమరయ్య భవనంలో మంగళవారం జరిగిన ఐద్వా జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి కొండా అనురాధ, పాదురి గోవర్ధన్, జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మల పద్మ, నాగమణి, సుల్తాన్, మాట్లాడారు.

ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మంగళవారం ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. వారిని ఆయా కళాశాల యాజమాన్యాలు అభినందించాయి.

నల్లగొండ పట్టణానికి చెందిన నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ ఫలితాలల్లో ప్రథమ సంవత్సరం ఎంపీసీ ఫలితాల్లో ఆమనగంటి సింధు, ఆరెకంటి శ్రీవల్లి 470మార్కులకు 468మార్కులు, దేవీశ్రీ ప్రసాద్, పి.సిరి 467 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో సల్కూటి హరిణి 437, వద్ది పూజిత 436, వేమిరెడ్డి ఇందురెడ్డి 433మార్కులు సాధిం చారు. ద్వితీయ సంవత్సరం బైపీసీ విభాగంలో సంకు వాహినిమిత్ర 994మార్కులు సాధించగా, ఎంపీసీ విభాగంలో చెరుకు నేహాలత, ఉమేష్ చంద్ర, ఏ. సంజయ్, ఆకాంక్ష 991 మార్కులు సాధించగా పిల్లి శ్రీజ 989 మార్కులు సాధించారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.శేఖర్‌రెడ్డి, ఏజీఎం వెంకట్ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

వేదాంత విద్యార్థుల విజయ దుందుభి

పట్టణంలోని శ్రీ వేదాంత జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో ఎన్.శిరీష 993, జె.అంకిత 991, డి.శ్రీ సిరి 989, ఎ.ఉదయ్ 983, కె.సాయిగణేష్‌రెడ్డి 982, పి.నాగశివ 951, కె.సుమంత్ రెడ్డి 949మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో జి.లక్ష్మిప్రసన్న 986మార్కులు సాధించి ప్రతిభ చాటారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఎం.దివ్యశ్రీ 465, జి.సంతోష్‌రెడ్డి 458, మీనాక్షి 457, జి.విఘ్నేష్, లక్ష్మిప్రసన్న 451 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో 440మార్కులకు జి.సిరి చందన 429, పి.వైష్ణవి 422 మార్కులు పొందారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ తోట శ్రీనివాసరావు, అధ్యాపకులు రఘు, రాంబాబు, విజయ్, అనిల్ అభినందించారు.

సత్తా చాటిన చైతన్య కళాశాల విద్యార్థుల

జిల్లా కేంద్రంలోని చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ సంవత్సరం ఫలితాలల్లో ఎంపీసీ విభాగంలో 470మార్కులకు ఎం. ప్రవళిక 467, బైపీసీ విభాగంలో 440మార్కులకు ఎం.ప్రసన్న కుమారి 436మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో ఎస్. శివాని 993, బైపీసీ విభాగంలో టి.భాగ్య 988 మా ర్కులు సాధించారు.విద్యార్థులను యాజమాన్యం టి.సురేందర్‌రెడ్డి, జి.మల్లికార్జున్, ప్రిన్సిపాల్ జి.వేణు గోపాల్‌రావు, అధ్యాపకబృందం అభినందించారు.

అల్ఫా ఆల్‌టైం రికార్డు...

ఇంటర్ ఫలితాల్లో అల్ఫా జూనియర్ కళాశాల మరోస్సారి ఆల్‌టైం రికార్డును సృష్టించింది. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో కె.వైష్ణవి 995, వై.శ్రీవల్లి 992, జె.త్రిపోతుల శివ 986, బైపీసీ విభాగంలో బి.శృతి 968, హెచ్ఈసీ విభాగంలో పి.నిశ్చల 978, కె.శ్రీహిత 966, వి.ప్రణీతారెడ్డి 934, ఎంఈసీ విభాగంలో నోమానుద్దీన్ 979, ఎంపీహెచ్ డబ్ల్యూ(ఎఫ్)లో డి.శివాని 974, ఎల్ ఎంఅండ్‌డిటీలో పి.లోకేష్ 964, ఎస్.పూజిత 929 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఫలితా ల్లో ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు డి.మమత, లక్ష్మి, అవంతిక 463మార్కులు, లహారిక 460, ఎంఈసీ విభాగంలో సయ్యద్ అఫ్వాన్ ఆలీ 450, సీఈసీ విభాగంలో 500మార్కులకు ఏ.మానస 477, జె.సిరి 476, పి.జగతి 472, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్)లో ఎం.భవ్య 489, ఎంఎల్‌టీ విభాగంలో ఎం.శివకుమార్ 439, ఎల్ఎంఅండ్‌డీటీ బి.శివప్రసాద్ 461, వి.రిషిక 454, సీఎస్‌లో ఎస్.సోని 438మార్కులు సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్ బాదిని రవికుమార్ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.లింగస్వామి, ఎస్. యాదగిరిరాజు, ఎం.శాతవాహనచారి, శివనాగప్రసాద్, సీహెచ్ .శ్రీరాములు, భూపాల్ తపాల్గొన్నారు.

శాబ్దులాపురం విద్యార్థి ప్రతిభ

కనగల్ : మండలంలోని శాబ్దులాపురం గ్రామానికి చెందిన కారింగ్ మనోజ్‌గౌడ్ ఇంటర్ ఎంపీసీ ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో 470/468 మార్కులు సాదించి రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించాడు.

● చిట్యాలరూరల్ : మండలం నేరడ గ్రామానికి చెందిన మిర్యాల శ్రీనిధి ఎంపీసీ విభాగంలో 1000/ 992 మార్కులకు సాధించి రాష్ట్ర ర్యాంకును సాధించింది. కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు గ్రామస్తులు శ్రీనిధిని అభినందించారు

● శాలిగౌరారం : మండలంలోని చిత్తలూరు గ్రామానికి చెందిన మీసాల ఇందిర యాదయ్య దంపతుల కుమార్తె రాగశ్రీ ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో 986మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపారు. రాగశ్రీని పలువురు అభినందించారు. రాగశ్రీ జెఈఈ మెయిన్స్‌లో కూడా అర్హత సాధించింది.

ప్రభుత్వ కళాశాలల్లో

● కేతేపల్లి :మండలంలోని కొర్లపహాడ్ మోడల్ స్కూల్, చెరుకుపల్లి కస్తూర్బా కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. కళాశాల నుంచి 40మంది విద్యార్థినులు ఇంటర్ సెకండియర్ పరీక్షలకు హాజరు కాగా 37మంది(92.5శాతం) విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారు. ఫస్టియర్ పరీక్షలకు 63మంది విద్యార్థినులు హాజరవగా 50మంది(79.37 శాతం) ఉత్తీర్ణులయ్యారు. అలాగే కొర్లపహాడ్‌లో మోడల్ స్కూల్ కాలేజీకి చెందిన సెకండియర్ విద్యార్థులు 72శాతం, ఫస్టియర్ విద్యార్థులు 52 శాతం ఉత్తీర్ణులయ్యారు. మోడల్ స్కూల్‌కు చెందిన నారగోని నందన్ ప్రణవి సెకండియర్ ఎంపీసీ విభాగంలో 932, ఎ.అక్షిత 959 మార్కులు, బైపీసీ విభాగంలో చిలుముల కృష్ణవేణి 886మార్కులు, సీఈసీ విభాగంలో కొప్పోలు శ్రీవల్లి 858 మార్కులు సాధించారు. ఆయా కళాశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

● నకిరేకల్, నకిరేకల్‌కు చెందిన జాయ్ ఒకేషనల్ జూనియర్ కళాశాలకు చెందిన కె.సుప్రజ 968/1000 మార్కులు సాధించి జిల్లాస్థాయి రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించారు.. ఎంపీహెచ్‌డబ్లూ/బాలికల విభాగంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఎం. శ్రీజ 957/1000 మార్కులు సాధించారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ కె. మమత తెలిపారు.

● శాలిగౌరారం : మండలంలోని వల్లాల మోడల్ స్కూల్‌లోని జూనియర్ కళాశాలలోని ఇంటర్ ఫలితాల్లో ద్వితీయ సంవత్సరం బైపీసీలో సీహెచ్.శ్రేయ 954, ఎంపీసీలో యశస్విని, బి.ప్రసన్న 953 మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో ఎస్.తేజస్విని 830మార్కులు సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో ఆర్.భవాని 459, బైపీసీలో డి.అక్షయ 355, సీఈసీ ఎల్.జయశ్రీ 436 మార్కులు సాధించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ తెలిపారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.150	230	260
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 । కనిష్ఠం 25.2



నల్లగొండలో ఫలితాలను చూస్తున్న విద్యార్థులు

ఇంటర్‌లో బాలికలదే పైచేయి

ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ

ఉమ్మడి జిల్లాలో ఇంటర్మీడియట్‌లో మరోసారి బాలికలే పైచేయి సాధించారు. మంగళవారం ఇంటర్ ప్రథమ,ద్వితీయ సంవత్సరం ఫలితాలు విడుదల కాగా, ప్రథమ సంవత్సరంలో జనరల్‌విభాగంలో నల్లగొండ జిల్లాలో బాలికలు 65.40శాతం, సూర్యాపేటజిల్లాలో బాలికలు 65.05 శాతం, యాదాద్రి జిల్లాలో బాలికలు 67.31శాతంతో ప్రతిభ చాటారు. ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో నల్లగొండ జిల్లాలో బాలికలు 60.97శాతం, సూర్యాపేట జిల్లాలో 75.05 శాతం, యాదాద్రి జిల్లాలో 76.41శాతంతో ఉత్తీర్ణత సాధించారు.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ, యాదాద్రి, భానుపురి)

నల్లగొండ జిల్లాలో...

నల్లగొండ జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో మొత్తం 11,694మంది పరీక్షలు రాయగా 6,781మంది (57.99శాతం) ఉత్తీర్ణులయ్యారు. అందులో బాలురు 5,452మంది పరీక్షలు రాయగా,2,699మంది (49.50శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికల విభాగంలో 6,262మంది పరీక్షలు రాయగా, 4,082మంది (65.40శాతం) ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో బాలికలే పైచేయి సాధించారు. ఒకేషనల్ విభాగంలో 2,283మంది పరీక్షలు రాయగా 1,150 మంది (50.37శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలుర విభాగంలో 1,259మంది పరీక్షలు రాయగా 461మంది (36.62శాతం), బాలికల విభాగంలో 1,024మంది పరీక్షలు రాయగా 689మంది (67.29శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత శాతం ఏమాత్రం మెరుగుపడలేదు. ఫస్టియర్‌లో రాష్ట్రంలో 16 స్థానం, సెకండియర్‌లో 19వ స్థానంలో నిలిచింది. అధ్యాపకులు, విద్యార్థులు సరైన దృష్టిసారించకపోవడంతో ఫలితాలు పడిపోయాయని పలువురు పేర్కొంటున్నారు. ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో 10,957 మంది పరీక్షలు రాయగా, 7,543మంది (68.84శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలుర విభాగంలో 5,006మంది పరీక్షలు రాయగా, 3052మంది (60.97శాతం), బాలికల విభాగంలో 5,951మంది పరీక్షలు రాయగా 4,491 మంది (75.47శాతం) ఉత్తీర్ణులయ్యారు. సెంకడియర్ జనరల్ విభాగంలో కూడా బాలికలే పైచేయి సాధించారు. ఒకేషనల్ విభాగంలో 2,035మంది పరీక్షలు రాయగా 1,417మంది(69.63శాతం) ఉత్తీర్ణులయ్యారు. అందులో బాలురు1,137మంది పరీక్షలు రాయగా 650 మంది(57.17శాతం), బాలికలు 898మంది పరీక్షలు రాయగా 767మంది (85.41శాతం) ఉత్తీర్ణులయ్యారు.

నాలుగేళ్లుగా నల్లగొండ జిల్లాలో ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత ఇలా..

సంవత్సరం	ఫస్టియర్			సెకండియర్		
	హాజరు	ఉత్తీర్ణత	శాతం	హాజరు	ఉత్తీర్ణత	శాతం
2020-21	16,240	9,805	61.00	16,061	10,964	68.00
2022-23	12,408	12,174	98.11	13,222	10,485	79.29
2023-24	11,555	6,610	57.02	11,474	7,854	68.45
2024-25	11,694	6,781	57.99	10,957	7,543	68.84

యాదాద్రి జిల్లాలో...

యాదాద్రి జిల్లాలో ప్రథమ సంవత్సరంలో 58.54 శాతం, ద్వితీయ సంవత్సరంలో 67.92శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో 6,208 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 3,634 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో 5,330 మంది పరీక్ష రాయగా, 3,756మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో బాలురు 48.88శాతం, బాలికలు 67.92శాతం, ద్వితీయ సంవత్సరంలో బాలురు 52.43శాతం, బాలికలు 72.33శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగంలో మొత్తం 62.96శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ప్రథమ సంవత్సరంలో 58.54శాతం, ద్వితీయంలో 67.92శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో 6,208 మంది విద్యార్థులకు 3,634మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 5,530మంది పరీక్ష రాయగా, 3,756మంది ఉత్తీర్ణత సాధించారు.

సూర్యాపేట జిల్లాలో...

సూర్యాపేట జిల్లాలో మొత్తం 75 కళాశాలలు ఉండగా, 15,586 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. గత ఏడాదికంటె ఈ విద్యాసంవత్సరంలో 8.8 శాతం ఉత్తీర్ణత పెరిగింది. ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 6,389 మంది పరీక్ష రాయగా, 3,613 మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో బాలురు 2,878 మంది పరీక్ష రాయగా, 1,329 మంది (48.18శాతం), బాలికలు 3,511మంది పరీక్ష రాయగా, 2,284 మంది (65.05 శాతం) ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది 49శాతం...

- మిగతా 7వ పేజీలో...



అవకాశాలకు నెలవు.. వేసవి సెలవులు

- రేపటి నుంచి వేసవి సెలవులు
- మరో వారంలో పదో తరగతి పరీక్షా ఫలితాలు

ఇంతకాలం పుస్తకాలతో కుస్తీపట్టిన పిల్లలు సెలవుల మూడ్‌లోకి వచ్చేశారు. ఈ నెల 17వ తేదీతో 1 నుంచి 9వ తరగతి వరకు పరీక్షలు పూర్తయ్యాయి. ఈ నెల 23న ప్రోగెస్ కార్డుల జారీతో 2024-25 విద్యాసంవత్సరం ముగియనుంది. 24వ తేదీ నుంచి పాఠశాలలకు సెలవులు. దీంతో చిన్నారులు వేసవి సెలవుల్లో ఉల్లాసంగా గడిపేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఇంటర్ పరీక్షలు పూర్తయి మంగళవారం ఫలితాలు వచ్చాయి. మరో వారంలో పదో తరగతి పరీక్ష ఫలితాలు కూడా రానున్నాయి. దీంతో భవిష్యత్ అవకాశాలకు, నాణ్యమైన విద్య అందించే ప్రణాళికల్లో తల్లిదండ్రులు నిమగ్నమవుతున్నారు. ఇతర కోర్సుల్లోని విద్యార్థులు సైతం సెలవులను ఆస్వాదిస్తూనే కొత్త కోర్సులపై దృష్టి సారిస్తున్నారు. అయితే విద్యాసంవత్సరం ముగియడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన, ఆరాటం పెరుగుతుంది. ఏ కోర్సుల్లో, ఏ కళాశాలలో చేర్పించాలని, బడ్జెట్ ఎంతవరకు సహకరిస్తుందనే లెక్కలు వేసుకుంటుంటారు. అయితే పిల్లల ఆసక్తి ఏంటో తెలుసుకోకుండా వ్యవహరిస్తే ప్రమాదమని, వారి అభిప్రాయాలకూ విలువ ఇవ్వాలని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

●6లో..

- (ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్, కోదాడ)

ఈ విద్యాసంవత్సరంలో అంతంతగానే బోధన!

- విద్యార్థులను వెంటాడిన సాంకేతిక సమస్యలు
- వన్ నేషన్, వన్ ఎడ్యుకేషన్ పాలసీకి కేంద్రం అడుగులు
- కొత్త విధానంతో ఇంటర్ స్థానంలో స్కూల్ ఎడ్యుకేషన్
- 5, 8వ తరగతిలో నోడిటెన్షన్ పాలసీ పునరుద్ధరణ

●6లో



బైపీసీలో 'గౌతమి' విద్యార్థికి 994 మార్కులు

- ఎంపీసీ విభాగంలో 993

●6లో..

ఎంపీసీలో 'ప్రగతి' విద్యార్థికి 995 మార్కులు

- బైపీసీ విభాగంలో 994

●6లో..





ఎంపీసీలో 'కేఎల్ఎన్' విద్యార్థికి 992 మార్కులు

- బైపీసీ విభాగంలో 985


●7లో..

రైతులకు సకాలంలో డబ్బు చెల్లించాలి

డీఆర్డీవో శేఖర్‌రెడ్డి



గుర్రంపోడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రైతులకు ధాన్యం డబ్బు సకాలంలో అందేలా చూడాలని డీఆర్డీవో శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కాచారం, చామలోనిబావి, కోయగూరోనిబావి, వట్టికోడు ఐకేపీ ఆధ్వర్యంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలకుండా చూడాలని, హమాలీల కేటాయించిన రూ.45 మాత్రమే చెల్లించాలన్నారు. ఏఈవోలు ప్రతీ రోజు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి తేమ శాతాన్ని పరిశీలించాలని సూచించారు. ఆయన వెంట ఏపీఎం ఊరుపక్క యాదయ్య, సీసీలు శేఖరయ్య, రాజేశ్వరి, తదితరులు ఉన్నారు.




భూభారతి చట్టం... ప్రజలకు చుట్టం



యాదాద్రి జిల్లా వలిగొండలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

యాదాద్రి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం.. ప్రజలకు చుట్టం అని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీవాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం వలిగొండలో భూభారతి(ఆర్‌వోఆర్) చట్టంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించేందుకు అధికారులే ప్రజల వద్దకు వస్తారని.. భూములున్న ఆసాములు, రైతులు తమ భూమి భద్రంగా ఉందని గుండెపై చేయి వేసుకుని నిద్దురపోవాలన్న లక్ష్యంతో భూభారతి రూపొందించామన్నారు. రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో భూభారతి పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్నామని, ఒక్క రూపాయి ఫీజు లేకుండా భూ సమస్యలను పరిష్కరిస్తామని.., అధికారులనే క్షేత్రస్థాయికి పంపిస్తున్నామన్నారు. నెలాఖరులోగా నాలుగు మండలాల్లో అన్ని వివరాలు సేకరించి, జూన్ 2న పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నా రు. మే1వ తేదీ నుంచి మరో 28 జిల్లాల్లో ఒక్కో మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకుని భూభారతిని అమలు చేస్తామన్నారు. పైలెట్ మండలాల్లో క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యల పరిష్కారంకోసం ఏమైనా సూచనలు వస్తే నియమనిబంధనల్లో మార్పులు, చేర్పులు చేస్తామన్నారు. గత ప్రభుత్వం అనాలోచనతో 2020 ధరణి చట్టాన్ని తీసుకొచ్చి... ప్రజలకు అనేక ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ధరణి చట్టాన్ని తీసుకొచ్చిన మూడేళ్ల వరకు నియమ నిబంధనలు రూపొందించలేదని... విధివిధానాలు స్పష్టంగా తెలియజేయలేదని.. కేసీఆర్ నోట ఏది వస్తే ఆ మాట ప్రకారమే నడుచుకుందన్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందుల నుంచి విముక్తి చేసేందుకు ఇందిరమ్మ రాజ్యంలో 2025లో భూభారతి చట్టాన్ని తెచ్చామన్నారు. ఏ చట్టమైన ప్రజలకు చుట్టంలాగా, భద్రత కల్పించేలా ఉండాలే తప్ప ప్రజలకు శాపంగా మారకూడదన్నారు. ధరణి పేరుతో భూములు లాక్కున్న వారిపై చర్య లు ఉంటాయని, రాష్ట్రంలో అన్ని రెవెన్యూ గ్రామాలకు అధికారులను నియమిస్తామని మంత్రి తెలిపారు. మే10వ తేదీలోగా సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలే మండలాలకు వస్తారని తెలిపారు. గ్రామాల్లో భూదాన్, వక్ఫ్, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం ఈ చట్టంలో ఉందన్నారు.





సివిల్స్‌లో మౌనిమకు 920వ ర్యాంక్



హాలియా, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): యూ పీఎస్సీ మంగళవారం ప్రకటించిన సివిల్స్- 2024 ఫలితాల్లో అనుముల మండలం వీర్లగడ్డతండా గ్రామానికి చెందిన దేపావత్ మౌని మ ఉత్తమ ప్రతిభ కనబరిచి 920వ ర్యాంక్ సాధించింది. వీర్లగడ్డతండా గ్రామానికి చెందిన దేపావత్ లచ్చిరాం కుమార్తె మౌనిమ ఇంటర్ హైదరాబాద్‌లో, బీటెక్ చెన్నై ఐఐటీ లో చదివి 2023లో స్టాఫ్ సెలక్షన్ కమిటీ పరీక్షల్లో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించింది. ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే ఆలిండియా సివిల్ సర్వీసెస్ పరీక్షకు సన్నద్ధమపై 920వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా ఆమెను కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా,ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హాలియా సబ్‌స్టేషన్ పరిధిలో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ధన్‌రాజ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ లైన్ వెంట ఉన్న చెట్లను తొలగించుటకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

మంత్రి పర్యటన రద్దు

మిర్యాలగూడ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం నిర్వహించాల్సిన పర్యటన రద్దయింది. క్యాథలిక్ మత పెద్ద రోమ్ బిషప్ పోప్ ఫ్రాన్సిస్ అస్తమయంతో కేంద్ర ప్రభుత్వం మూడు రోజులు సంతాపం ప్రకటించింది అలాగే ఇరిగేషన్, సివిల్ సప్లయ్ అధికారులతో నిర్వహించాల్సిన సమీక్షా సమావేశాన్ని రద్దుచేసినట్లు పేర్కొన్నారు.

ఉపాధి హామీ పెండింగ్ బకాయిలు చెల్లించాలి



కూలీల సమస్యలు తెలుసుకుంటున్న కంబాలపల్లి ఆనంద్

దేవరకొండ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలం షైనంపల్లిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం ఆయన పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు వారం, వారం చెల్లించాల్సిన బకాయిలు నెలల తరబడి చెల్లించడంలేదన్నారు. వేసవిలో మంచినీరు, టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధి కూలీలు ఎల్లయ్య, వెంకటయ్య, అంజయ్య, లక్ష్మమ్మ, ఎల్లమ్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.

పేదలందరికీ ఆత్మీయ భరోసా అందించాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న నారి ఐలయ్య

వేములపల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): భూమి లేని పేదలందరికీ ప్రభుత్వం ఆత్మీయ భరోసా కింద రూ.12,500 అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య అన్నారు. మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేలా నిధులు తగ్గిస్తూ వస్తుందన్నారు. కార్యక్రమంలో వ్య.కా.స జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన్నవెంకులు, జిల్లా సహాయ కార్యదర్శి పెంటమల్ల సుకన్య, బొంత పుల్లయ్య, బంటు పద్మ, బొడ్డు పద్మ, రాములు, లచ్చయ్య, మచ్చ అంజమ్మ, గడ్డం యుగంధర్, బంటు శ్రీను, పి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడిగా పాపిరెడ్డి

పెద్దవూర, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఇరుమాది పాపిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నరాందాస్ దుర్గాప్రసాద్‌ఎన్నికయ్యారు. ఈమేరకు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డి మంగళవారం వారికి నియామకపత్రం అందజేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన పాపిరెడ్డిని, దుర్గాప్రసాద్‌ను పలువురు సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో రాము, పరుశురామ్‌గౌడ్, ఎం.మధు, రాము, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్రామ్‌నాయక్, రూప, దేవేందర్, నాగిరెడ్డి, సంతోష్, రామ్మూర్తి, పార్వతి, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలపై సూచనలు చేయాలి

దామరచర్ల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై తల్లిదండ్రులు తరుచుగా సమీక్షించి ఉపాధ్యాయులకు సూచనలు చేయాలని ఎంఈవో బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని కల్లెపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రెండు నెలలకోకసారి పేరెంట్ టీచర్స్ మీటింగ్ ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రగతిపై చర్చించాలని అన్నారు. పాఠశాలలో నెలకొల్పిన మౌలిక సదుపాయాలు, డిజిటల్ తరగతులు, కంప్యూటర్ ల్యాబ్‌ను విద్యార్థులు ఉపయోగించుకొని గుణాత్మక విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ధీరావత్ బుజ్జి లింగానాయక్, మాజీ ఎంపీటీసీ ధీరావత్ శారదాపాచ్యనాయక్, ఇన్‌చార్జి హెచ్‌ఎంగొబ్బూరి శ్రీనివాస్‌రావుఉన్నారు.

విద్యార్థుల బడిబాట

చింతపల్లి: మండలంలోనివీ.టీనగర్, పోలేపల్లిరాంనగర్, బోటిమీదితండా పాఠశాలలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకుల నేతృత్వంతో మంగళవారం బడి బాట నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం ఎండి.అన్వర్. వోలీ సుధీర్ కుమార్, సౌజన్య, శివలీలా పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

చింతపల్లి, మార్చి 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం భగత్ సింగ్ 94వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్స్‌రోడ్డు సమీపంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళి అర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్, మండల కార్యదర్శి ఉడుగుంట్ల రాములు, గణేష్, కృష్ణయ్య, యాదయ్య, శ్రీను పాల్గొన్నారు.

జానారెడ్డి కుటుంబంపై నిందలు తగదు

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డితోపాటు వారి కుమారులపై రాజకీయ ప్రయోజనాల కోసం నిందలు మోపడం సరైందికాదని యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు అనుముల అంజి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా నిడమనూరు మండలం బొక్కమంతులపాడుకు చెందిన దళిత యువతి ఆత్మహత్యను వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు ఉపయోగించుకోవాలని చూస్తున్నారన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు వరదపాక రాజాలు, గాలిమెట్టి నాగేష్, చింత మల్ల వెంకటయ్య, సైదులు, అనుముల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భారతదేశం భిన్నసంస్కృతులకు మూలం

హాలియా,ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): భారతదేశం భిన్న సంస్కృతులకు మూలమని ఎంఈవో గుండా కృష్ణమూర్తి అన్నారు. హాలియా జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఛ ఈ సందర్భంగా నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాల్లో స్నేహం విలువలు తెలిపే చల్ మీ ప్రోగ్రాం, భారత దేశం విశిష్టతను సమగ్రతతను తెలియపరిచే ఏక్ భారత్ శ్రేష్ట భారత్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శైలజ, సైదులు, నర్సింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, సైదిరెడ్డి, అరవింద్‌కుమార్, చెన్ను వెంకట్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, పార్వతమ్మ, కృష్ణవేణి, శకుంతల, శ్రీదేవి, కల్పలత, ముజాయిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు బీమా కల్పించాలి

మిర్యాలగూడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు రూ. 10 లక్షల ప్రమాద బీమా కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో లైట్‌మోటార్స్ వెహికిల్స్ కార్మికులతో కలసి మేడే వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ. గ్రాట్యుటీ, బోనస్, పెన్షన్ చట్టాలను అమలు చేయాలన్నారు. హమాలీ ఆటో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం తేవాలన్నారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ప్రభుతవరంగ సంస్థలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై వుందన్నారు. గ్రామపంచాయితీ వర్కర్లకు నేరుగా రూ. 26 వేల జీతం ఇవ్వాలన్నారు. కార్మికుల హక్కులను రక్షించుకునేందుకు సంఘటితంగా ఉద్యమించాలని కోరారు. 139వ మే డేను ఘనంగా నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి. సయాద్, ధీరావత్ లింగా నాయక్, వల్లంపట్ల వెంకన్న, లైట్‌మోటార్స్ వెహికిల్ యూనియన్ కోశాధికారి వెంకన్న, జానయ్య, చోటు, షఫీ, శ్రీనివాసరాజు, సురేష్ పాల్గొన్నారు.

గూడూరు ఉక్కిరి బిక్కిరి



డంపింగ్‌యార్డు నుంచి వెలువడుతున్న పొగ

» గ్రామాన్ని చుట్టేస్తోన్న డంపింగ్ యార్డు పొగ
» అనారోగ్యం బారిన పడుతున్న ప్రజలు
» సమస్యను పరిష్కరించాలని వేడుకోలు

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ రూరల్): మునిసిపాలిటికి కూతవేటు దూరంలో ఉన్న గూడూరు గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డు గ్రామస్తులను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.మునిసిపాలిటి పరిధి రామ్‌నగర్ బందం వద్ద 25 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విస్తరిస్తున్న మునిసిపాలిటీతో పట్టణంలోని వ్యర్థాలు అధికమయ్యాయి. దీంతో ఏళ్ల తరబడి ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతరత్ర వ్యర్థా లు కుప్పలుగా వేయడంతో రసాయనిక చర్యల వల్ల అందులో వేడిపుట్టి దహనమవుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.వాస్తవంగా ప్రస్తుతం కొనసాగుతున్న డంపింగ్‌యార్డు ఆరు ఎకరాల విస్తీర్ణంలో ఉంది. స్థలం చాలక అత్యాధునిక సౌకర్యాలు కల్పించకపోవడంతో చెత్తను తగులబెట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

దీంతో రామ్‌నగర్ బందం, పద్మావతినగర్, ఈదులగూడతోపాటు పచ్చనిపంటలతో కనువిందు చేసే బాదలాపురం, గూడూరు పల్లెల్లోకి డంపింగ్‌యార్డు పొగ వ్యాపిస్తుండడంతో అనారోగ్యాల పాలవుతున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. ఐదేళ్ల డంపింగ్ యార్డు సమస్యపై గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, కాలుష్య నియంత్రణ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో ఇప్పటికే కొందరు క్యాన్సర్, ఇతర అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల పాలై ఆర్థికంగా, అనారోగ్యాలతో చితికిపోతున్నామని, భవిష్యత్ తరాలు ఇబ్బందులు ఎదుర్కోకుండా తగిన చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.



డంపింగ్‌యార్డును తరలించాలని గ్రామస్తుల ఆందోళన (ఫైల్)

డంపింగ్‌యార్డును తరలించాలి



ప్రజల ఇబ్బందులను గుర్తించి డంపింగ్‌యార్డును ప్రజా నివాసాలకు దూరంగా ఏర్పా టు చేసేలా చర్యలు తీసుకోవాలి. గ్రామంలో అనారోగ్య సమస్యలపై కమిషనర్, కలెక్టర్‌కు వివరించాం. ఎలాంటి ప్రయోజనం లేదు. చిన్నారులు, వృద్ధులు డంపింగ్‌యార్డు పొగ వల్ల అనారోగ్యం పాలవుతున్నారు. దీనికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగించాలి.

- శ్రీనివాస్, గూడూరు

స్థల సేకరణకు అధికారులతో చర్చించాం



డంపింగ్‌యార్డుల నుంచి గ్రామాల్లోకి పొగ రావడం లేదు. తగులబెడుతున్నారని పేర్కొనడంలో వాస్తవం లేదు. రైస్ మిల్లుల కాలుష్యంతోనే గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. చెత్త నుంచి వెలువడే రసాయనిక చర్యల వల్ల పొగ రావడం జరుగుతుంది. మునిసిపాలిటిలో 48వార్డులకు స్థలం సరిపోవడం లేదని సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు స్థలాన్ని సేకరించాలని రెవెన్యూ అధికారులతో చర్చించాం. బయో విధానంతో డంపింగ్‌యార్డు నిర్వహణ కంపోస్ట్ ఎరువుల తయారీకి ప్రయత్నాలు చేపట్టబోతున్నాం.

- ఎండీ యూసుఫ్, మునిపల్ కమిషనర్, మిర్యాలగూడ

చరిత్రలో నిలిచిపోయేలా బీఆర్ఎస్ రజతోత్సవ సభ

పెద్దవూర, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌తో కలిసి మాట్లాడారు. సభలో కేసీఆర్ మాట్లాడే స్పీచ్ కోసం రాష్ట్ర ప్రజలందరు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అతి తక్కువ సమయంలోనే ప్రజాదరణ కోల్పోయిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో కాంగ్రెస్ అబాసుపాలైందన్నారు. రైతులకు రైతు భరోసా లేదు, రైతు బీమా లేదు, రుణమాఫీ పూర్తిగా అమలు కాలేదని, ఆసరా పింఛన్లు పెంచలేదని ఆరోపించారు. కాంగ్రెస్ మాయమాటలకు ప్రజలు మోసపోయారని, ఇప్పుడు ప్రజలు తిరిగి కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు గత పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ఈనెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, గోనె విష్ణువర్ధన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జటావత్ రవినాయక్, మాజీ ఎంపీపీ సుందర్‌రెడ్డి, రమావత్ రవినాయక్, మెండె సైదులు, నడ్డి లింగయ్య, పొదిల శ్రీను, కొట్టే బాలయ్య, నడ్డి బాలరాజుయాదవ్, కిషన్‌నాయక్, శ్రీకర్‌నాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దవూర: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

హాలియా : పోయింది అధికారము మాత్రమేనని తెలంగాణ ప్రజల గుండెల్లో ఉన్నది గులాబీ జెండానేనని నాగార్జునసాగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ విజయవంతం కోసం హాలియాలో అనుముల మండలానికి చెందిన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఆప్కాబ్ చైర్మన్ యడవల్లి విజయేందర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, అనుముల మండలం ముఖ్య నాయకులు, గ్రామ అధ్యక్షులు, కార్యదర్శులు, బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

గుర్రంపోడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : గుర్రంపోడ్ మండల కొప్పోలు గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు బల్లూరి శేఖర్ ఇటీవల ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌కు ఢీకొని అక్కడికక్కడే మతి చెందాడు. అతడి మృతి విషయాన్ని కుటుంబ పరిస్థితిని కానా సంస్థ స్థానిక ప్రతినిధి బల్గూరి వెంకన్న, నాతి గణేష్ కు వివరించగా వారు వెంటనే విషయాన్ని యూఎస్‌లో ఉన్న కానా ఫౌండేషన్ వారికి తెలియజేయడం వారు వెంటనే స్పందించి మృతుని కుటుంబానికి రూ. 20వేలు ఆర్థిక సహాయం తక్షణమే మంజూరు చేశారు. రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని మంగళవారం మృతుని భార్య బల్గూరి కవితకు కానా స్థానిక ప్రతినిధి బల్లూరి వెంకన్న, బల్లూరి నగేష్, మండల గౌడ సంఘం అధ్యక్షులు ఐతగోని వెంకటేశం గౌడ్‌లు అందజేశారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం అభినందనీయమని ఫౌండేషన్ సభ్యులను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో బల్గూరి హరీష్, ఐతగోని శంకర్, కస్తూరి సురేష్, జంపాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరాములోరి కల్యాణం

చింతపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోద్గులమల్లేపల్లిలో కుర్మచాల సీతారామచంద్ర స్వామి కల్యాణ వేడుకలు మంగళవారం కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో సీతారాముల స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకం చేసి నూతనవస్త్రాలు కట్టించి వివిధ రకాల పువ్వులతో అలకరించారు. కుర్మచాల సీతారామ చంద్రస్వామి కల్యాణ తంతను కమనీయంగా జరిపారు. విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదంతో పాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వింజమూరి లక్ష్మణ్‌శర్మ, వైద్యుల రవీంద్రనాథ్‌శర్మ, ప్రవీణ్‌కుమార్‌శర్మగాదేభట్ల బాలయ్యశర్మ, సోమేశ్వర్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

అడవిదేవులపల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు నిత్యం పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కొత్తనందికొండ గ్రామంలో గల అంగన్‌వాడి కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు చిరుధాన్యాలు, ఆకుకూరగాయలు, పండ్లు, గుడ్లు, పాలు వంటి పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రతి నెలా 0-5 సంవత్సరాలలోపు పిల్లలకు ఎత్తు, బరువులను తప్పకుండా తీయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు మాధవి, వినోజ, ఆశా నాగమణి, స్కూల్ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

చందంపేట : చిన్నారులకు పౌష్టిక ఆహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న అన్నారు. మంగళవారం చందంపేట మండలంలోని తెల్‌దేవరపల్లి గ్రామంలో పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో ముకుమ్మడిగా చిన్నారులకు అక్షరభ్యాసం, అన్నప్రాసన, బాలింతలకు సీమంతం కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరు సమతుల ఆహారం తీసుకోవాలని, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు పౌష్టికాహారం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తుందన్నారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు.



అడవిదేవులపల్లి: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నాగమణి

చింతపల్లి : కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు పోషకాహారం తప్పకుండా తీసుకోవాలని డివిజన్ డీఏల్పీవో శంకర్‌నాయక్ తెలిపారు. మంగళవారం మండలంలోని తీదేడు(వెంకటంపేట), బోటిమిదితండా, అంగన్వాడీ కేంద్రాలో పోషణ పక్షంలో భాగంగా గర్భిణీ, బాలింతలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సూపర్‌వైజర్లు అంజమ్మ, సుగుణ, మాజీ సర్పంచులు కాయితి జితేందర్ రెడ్డి, దాసరి శ్రీనివాస్‌యాదవ్, పంచాయతీ కార్యదర్శి ఆశోక్, ప్రభాకర్‌రెడ్డి, టీచర్లు లక్ష్మి, వెంకటమ్మ, స్వప్న, కవితి, వసంత, బుజ్జి పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

నారాయణ విద్యార్థుల హవా

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో పట్టణంలోని నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థుల హవా కొనసాగింది. జూనియర్, సీనియర్ విభాగాలలో కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ దొంతం వెంకటరెడ్డి తెలిపారు. ప్రథమ సంవత్సర ఎంపీసీ విభాగంలో బీ. సాయిచరణ్, డీ.సీతుచంద్రా, మదిహ 467/470 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో ఎస్. దీపిక 437/440 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిందన్నారు. ఇక సీనియర్ ఇంటర్ ఎంపీసీలో ఈ. మధువిత 991/1000 మార్కులు సాధించడం ఆదర్శనీయమన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల డీన్ కోట శ్రీనివాసరెడ్డి, ఏజీఎం దొంతరెడ్డి కరుణాకర్‌రెడ్డి అభినందించారు.

సత్తాచాటిన అక్కాచెల్లెలు

● మిర్యాలగూడ టౌన్: పట్టణానికి చెందిన అక్కాచెల్లెలు బెజ్జం జలదిజ, చరితశ్రీ సత్తాచాటారు. రాష్ట్ర రాజధాని సనత్‌నగర్‌లో ప్రభుత్వ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసి స్తున్న బెజ్జం జలదిజ ఎంపీసీలో 970మార్కులు, ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో బెజ్జం చరితశ్రీ 466/470 మార్కులు సాధించారు. వారి తండ్రి బెజ్జం సైదులు ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు.

విద్యార్థినికి అభినందన

● ఇంటర్ ప్రథమ సంవత్సర ఎంపీసీ విభాగంలో 468/470 మార్కులు సాధించిన చీదళ్ల నిత్య తేజస్వినిని పట్టణ ప్రముఖులు అభినందించారు. పట్టణానికి చెందిన చీదళ్ల గోపీ-లక్ష్మీ దంపతుల కుమార్తె నిత్య హైదరాబాద్‌లోని రామచంద్ర మిషన్ కన్య విద్యాలయంలో చదువూత 468 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది.

● వేములపల్లి: మండలంలోని లక్ష్మీదేవిగూడెం గ్రామానికి చెందిన చెరుపల్లి యమున ఎంపీసీ విభాగంలో 992 మార్కులు సాధించింది. యమున నల్లగొండలోని గౌతమి కళాశాలలో చదివింది. శెట్టిపాలెం గ్రామానికి చెందిన బండారు హిమని హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని గురుకులంలో బైపీసీలో 437 మార్కులు సాధించింది. అదే గ్రామానికి చెందిన శ్రీపాద దీపిక మిర్యాలగూడ పట్టణంలోని నారాయణ కళాశాలలో బైపీసీ చదువుతూ 437 మార్కులు సాధించింది.



పీఏపల్లి : విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనయ్య, అధ్యాపక బృందం

● కొండమల్లేపల్లి: మండల కేంద్రంలో బీసీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలకు చెందిన డి.హేమలత ఎంపీసీ విభాగంలో 988 మార్కులు, బైపీసీవిభాగంలో పి.శైలజ 989 మార్కులు, సీఈసీ విభాగంలో జి.జ్యోత్స్న 967 మార్కులు, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో జి.జ్ఞానేశ్వరి 462 మార్కులు సాధించింది. ఎస్సీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో బైపీసీ విభాగంలో జే.శ్రీలత, డి.ఇందు 986, ఎంపిసి విభాగంలో ఎ.రక్షిత 976, ఆర్.ప్రవళిక 974మార్కులు సాధించారు. ఎస్టీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఎంపీసీ విభాగంలో బి.నవ్య 933, బైపీసీ విభాగంలో ఈ.అనూష 895 మార్కులు సాధించినట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ మల్లీశ్వరి, శౌరీలు, శారద తెలిపారు.

● నాగార్జునసాగర్: సాగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు విద్యార్థినిత ఎన్.సహస్ర ఎంపీసీ విభాగంలో 982 మార్కులు సాధించి జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రథమ స్థానం సాధించింది. బైపీసీ విభాగంలో పి.ఝాన్సీ 971 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రావు తెలిపారు. బీసీ గురుకుల జూనియర్ కళాశాలలో సాయినాథ్ 973 మార్కులు, సీఈసీ విభాగంలో వెంకటరమణ 930 మార్కులు సాధించారు.

● పెద్దఅడిశర్లపల్లి:దుగ్యాల ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారు. బైపీసీలో జి. మురళి 978, ఆర్. నాగమణి 964, ఎంపీసీ విభాగంలో ఓ.బిందుప్రియ 951, బి. మనోజ్ 927, సీఈసీ విభాగంలో ఎం. భార్గవి 863, జి. చైతన్య 848 మార్కులు సాధిం చారని ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ నకిరే కంటి శ్రీనయ్య తెలిపారు.

●గుర్రంపోడు: మండలంలోని మోడల్ స్కూల్‌లో మొదటి సంవత్సరం విద్యార్థులు 113 మందికి గాను 90 మంది ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 113 మందికి గాను 108 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ జి. రాగిణి తెలిపారు. పిట్టలగూడెం గ్రామంలోని మైనార్టీ గురుకుల కళాశాలలో ప్రథమ సంవత్సరం 37 మందికి 36, రెండో సంవత్సరం 35 మందికి 35 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ ఫారూఖ్ తెలిపారు. మోడల్ స్కూల్‌లో ఎంపీసీలో పగిళ్ళ సౌజన్య 975 మార్కులు, బైపిసిలో బొమ్ము నితీష 942 మార్కులు సాధించారు. టాపర్‌గా నిలిచింది. మైనార్టీ కళాశాలలో ఇటికాల కౌషిక్ ఎంఈసీ విభాగంలో 900 మార్కులు సాధించగా సీఈసి విభాగంలో దారం చరణ్ 928 మార్కులు సాధించారు.. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

●డిండి: మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో 83శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బి.మానస 979 మార్కులు, శ్రావణి 972, బైపీసీ గ్రూపులో శ్రుతి 983, అనీష 981 మార్కులు సాధించి మండల టాపర్స్‌గా నిలిచారు. ఆదర్శ పాఠశాలలో 116 మంది ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాయగా 34 మంది ఉత్తీర్ణత సాధించారు. బైపీసీ గ్రూపులో 962 మార్కులు ఎన్.సారిక సాధించారు. దొంతినేని నర్సింహరావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 62 మంది విద్యార్థులు పరీక్షలకు హజరుకాగా 21 మంది ఉత్తీర్ణులయ్యారు. దొడ్డి పూజిత ఎంపీసీలో 928 మార్కులు సాధించింది.

దేవరకొండ: దేవరకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. బైపీసీ ద్వితీయ సంవత్సరంలో కలియా అనే విద్యార్థిని 985 మార్కులు సాధించింది. అక్షర అనే విద్యార్థిని 982 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ శ్రీదేవి మంగళవారం తెలిపారు. బాలికల కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 124 మంది విద్యార్థులకుగాను 62 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, మొదటి సంవత్సరంలో 120 మంది విద్యార్థులకు 70 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

● దేవరకొండ మైనార్టీ జూనియర్ కళాశాలలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు. ఎంపీసీలో అబ్దుల్ సమద్ 963, ముజమిల్ 956, చరణ్ రెడ్డి 955, అదనాన్ సమి 906, బైపీసీలో చరణ్ 705,ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో గౌస్ 459, సిద్ధార్థ్‌రెడ్డి 455, సందీప్ 454, ప్రథమ సంవత్సరం బైపీలో కిరణ్ 353, విక్టర్ 317 మార్కులు సాధించినట్లు కళాశాల నిర్వాహకులు తెతిపారు.

● హాలియా: మండల కేంద్రానికి చెందిన కొక్కు యగ్నేష్ నిడమనూరులోని మోడల్ కాలేజ్‌లో విద్యనభ్యసించి 985 మార్కులు సాధించాడు. జిల్లెపల్లి ప్రమోద్ నిడమనూరులోని మోడల్ కాలేజ్‌లో చదివి 981 మార్కులు సాధించాడు. ఋషి పావని నల్లగొండలోని సోషల్ వెల్ఫేర్ కళాశాలలో చదివి 980 మార్కులు సాధించింది.